




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 342, పేజీలు - 08

మంగళవారం, జూన్ 2, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## బెంగాల్లో అడ్డుకుంటే ఢిల్లీలోనే తేల్చుకుంటా

**- మమత బెనర్జి సీరియస్ వార్నింగ్**



**కోల్కతా (ప్రశ్న న్యూస్)** పశ్చిమబెంగాల్లో ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం, వరుసగా విపక్ష టీఎంసీ నేతల్ని టార్గెట్ చేస్తోంది. ముఖ్యంగా రెండు రోజుల్లోనే ఇద్దరు ఎంపీలు అభిషేక్ బెనర్జీ, కళ్యాణ్ బెనర్జీలపై బీజేపీ కార్యకర్తలు రోడ్డుపైనే దాడులకు దిగారు. ఈ నేపథ్యంలో నేడు కోల్కతాలో బహిరంగసభ నిర్వహించాలని మమతా బెనర్జీ నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ నేతలంతా తరలిరావాలని ఆదేశాలు కూడా ఇచ్చారు. అయితే ఈ సభకు బీజేపీ సర్కార్ అనుమతి నిరాకరించింది.

దీనిపై మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కోల్కతాలో ర్యాలీ నిర్వహించేందుకు పోలీసులు అనుమతించకపోతే తాను ఢిల్లీకి వెళ్లి ఒంటరిగా నిరసన తెలుపుతానని మమత వార్నింగ్ ఇచ్చారు. వర్చువల్గా పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో మంగళవారం కోల్కతాలోని రాణి రష్మోని రోడ్లో నిరసన తెలిపేందుకు టీఎంసీ అనుమతి కోరిందని, అయితే పోలీసులు దానిని నిరాకరించారని మమత ఆరోపించారు. ఇది

2లో..

## రామగుండం యూరియా అంతా

# తెలంగాణకే కేటాయించాలి

**- వర్షాకాలం ముందస్తు చర్యలపై సీఎం రేవంత్ సమీక్ష**

- కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా జలాలు దక్కేలా చూడాలి
- రాష్ట్రంలోని అన్ని డ్యామ్ల గేట్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి
- అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని అధికారులకు ఆదేశం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా జలాలు దక్కేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎగువ రాష్ట్రాలు డ్యామ్లు నిండిన తర్వాతే నీళ్లు వదిలే విధానాన్ని పాటిస్తే మనకు ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో తీసుకోవలసిన ముందస్తు చర్యలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఆరోగ్య, హోం, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొనేలా పరిస్థితులు ఉన్నందున అంతరాష్ట్ర జలాల్లో ప్రొరేటా ప్రకారం తెలంగాణకు రావాల్సిన వాటా జలాలు వచ్చేలా ఆయా రాష్ట్రాల అధికారులతో ముందుగానే చర్చించి తగిన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

### డ్యామ్లకు ఇబ్బందులు వస్తే కఠిన చర్యలు

మహారాష్ట్రలోని కోయనా డ్యామ్ నీటిని వంద శాతం జల విద్యుదత్పత్తికే

2లో..



## సీఎంగా తొలి సభలోనే

# విజయ్ ఫైర్

**- తమిళనాడులో పోరు ఇక డీఎంకే, టీవీకే మధ్యేనన్న విజయ్**



**చెన్నై (ప్రశ్న న్యూస్)** తమిళనాడులో గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే అధినేతగా అనూహ్య పరిణామాల మధ్య సీఎం పదవి చేపట్టిన విజయ్ పాలనలో సైలెంట్ గా దూసుకుపోతున్నారు. కానీ తొలిసారి ఆయన తిరుచ్చిలో నిర్వహించిన బహిరంగసభలో మాత్రం అందుకు విరుద్ధంగా ఫైర్ మోడ్ లోకి వచ్చేశారు. రాష్ట్రంలో గత డీఎంకే పాలనలో నెలకొన్న పరిస్థితుల నుంచి మొదలుపెట్టి తన భవిష్యత్ వ్యూహాల వరకూ అన్ని అంశాలపైనా విజయ్ క్లారిటీ ఇచ్చేశారు.

తాను ప్రజలను తప్పుడు వాగ్దానాలతో తప్పుదోవ పట్టించడానికి లేదా మోసం చేయడానికి రాజకీయాల్లోకి రాలేదని విజయ్ తెలిపారు. మీ పక్షాన నిలబడి, మీ కోసం పనిచేయడానికే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. దాని గురించి ఎలాంటి సందేహం గానీ, అస్పష్టత గానీ లేదన్నారు. డీఎంకే, అనేక ఇతర పార్టీలు శాంతిభద్రతలు సరిగ్గా లేవని, ఫలానాది సరిగ్గా పనిచేయడం లేదని చెబుతూ, మమ్మల్ని విమర్శిస్తూనే ఉన్నాయని, కానీ మీరు సరిగ్గా ఏమి మిగిల్చి వెళ్లారు? ఒక్క పట్టణాన్ని గానీ, వీధిని గానీ వదలకుండా, మీరు మాదకద్రవ్యాల సంస్కృతిని ప్రతిచోటా వ్యాపించడానికి అనుమతించారని చురకలు అంటించారు.

డ్రగ్స్ కల్చర్ ను ప్రారంభ దశలోనే నియంత్రించి ఉండాల్సిందని, మీరు అలా చేసి ఉంటే, ఇంతమంది బాలికలు, మహిళలు బాధపడాల్సిన లేదా ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితికి మనం చేరుకునేవాళ్ళమా? అని స్టాలిన్ ను ప్రశ్నించారు. ఇవన్నీ చేసిన తర్వాత, ఇప్పుడు నిందను తనపై మోపుతున్నారన్నారు. స్టాలిన్ లాంటి సందిగ్ధత ఎప్పటికీ ఉండదన్నారు. లౌకికవాద సూత్రంపై

2లో..

# కత్తులు, కటార్లతో వస్తే చూస్తూ ఊరుకోం

**- తుని నియోజకవర్గంలో పేదల సేవలో సభ**

- సుపరిపాలన చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శలు
- నంద్యాలలో వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తేనని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.65,887 కోట్లకు పైగా పెన్షన్లు పంపిణీ చేశామని వెల్లడి






**అమరావతి (ప్రశ్న న్యూస్)** కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనా యజ్ఞం చేస్తుంటే, ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు రాక్షసుల్లా ఆటంకాలు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయిన కడుపు మంటతోనే రాష్ట్రంలో విద్వేషాలు రగిల్చేందుకు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరంలో సోమవారం జరిగిన 'పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

2లో..

## పవన్ కళ్యాణ్కు షాకిచ్చిన తెలంగాణ పోలీసులు

**- జనసేన నవ నిర్మాణ సంకల్ప సభకు అనుమతి నిరాకరణ**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల మధ్య రాజకీయ నేతల మధ్య తీవ్ర మాటల యుద్ధం నడుస్తున్న వేళ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్కు షాక్ తగిలింది.

2లో..

# మా జోలికి వస్తే మూతి పళ్లు రాలుతాయి

**- పవన్ కళ్యాణ్పై కల్వకుంట్ల కవిత ఫైర్**

- మా అస్తిత్వంపై దాడి చేస్తూ మీ సంస్కృతి రుద్దుతామంటే ఊరుకోం
- ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం జరగాలి
- ఆంధ్రా రాజకీయ నాయకులు ఏజెంట్ సీఎం రేవంత్
- మా రాజకీయాల్లో వేలు పెడతామంటే కుదరదన్న కవిత
- సామాజిక తెలంగాణ సాధించుకోవాలన్న కవిత



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణపై ఆంధ్ర నేతలు చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై తెలంగాణలోని రాజకీయ నాయకులు, ఉద్యమ నేతలు, మేధావులు తీవ్రంగా మండిపడుతున్నారు. తాజాగా హైదరాబాద్ బంజారాహిల్స్లోని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు - సాధన సమావేశంలో ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు ఆంధ్రప్రదేశ్లోని అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలపైనా ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారు. తాను చాలా

2లో..

## కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'

**- యువతకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు!**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాజకీయాల్లోకి సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఒక సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం గాంధీ భవన్లో పార్టీ తరఫున వినూత్నమైన 'టాలెంట్ హంట్' ప్రోగ్రామ్ను అధికారికంగా ప్రకటించారు. ప్రజా జీవితంలోకి రావాలనుకునే ప్రతిభావంతులైన యువతీ యువకులకు కాంగ్రెస్ పార్టీ ఒక

2లో..

# ఏపీకి ఎయిర్ ట్రంక్

**- సీఈవో రాబిన్ ఖుదాతో లోకేష్ భేటీ**

- విశాఖలో ఫ్యూచర్ క్యాంపస్ ఏర్పాటు చేయాలని ఆహ్వానం
- విశాఖను డేటా సెంటర్ హబ్గా తీర్చిదిద్దుతున్నామని వెల్లడి
- ఇప్పటికే భారత్లోకి ప్రవేశించిన ఎయిర్ట్రంక్ సంస్థ



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్కు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా, ప్రపంచవ్యాప్తంగా హైపర్స్కేల్ డేటా సెంటర్లను నిర్వహిస్తున్న ప్రఖ్యాత సంస్థ ఎయిర్ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో ముంబయిలో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. విశాఖపట్నంలో

2లో..

## ధాన్యం కొనుగోళ్లలో ఎందుకు ఈ నిర్లక్ష్యం.?

**- రేవంత్ ప్రభుత్వానికి రాంచందర్ రావు ప్రశ్న**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైస్ మిల్లర్లతో కుమ్మక్కైందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో కొనుగోళ్లు సాగుతున్న తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. "చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని నాడు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మరి ఇప్పుడెందుకు ఈ నిర్లక్ష్యం?"

2లో..

## నెలరోజుల్లోనే ఇల్లు నిర్మాణం..

# సరికొత్త టెక్నాలజీ

- కాగజ్నగర్ సభలో సీఎం రేవంత్రెడ్డి
- కొరాారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న సీఎం
- రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి పైలాన్ ఆవిష్కరణ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలి విడతలో భాగంగా నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్ల గృహ ప్రవేశం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించారు. కోరాారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఈ సందర్భంగానే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి పైలాన్ను ఆవిష్కరించారు. రెండో విడతలో రాష్ట్రంలో మరో రెండున్నర లక్షల మందికి ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు.

2లో..

## బెంగాల్లో అడ్డుకుంటే ఢిల్లీలోనే తేల్చుకుంటా

రాజకీయ ప్రేరేపిత నిర్ణయం అన్నారు.తాను ఆందోళనను కొనసాగిస్తానని, అవసరమైతే జాతీయ రాజధానిలో కూడా నిరసన తెలుపుతానని ఆమె స్పష్టం చేశారు. బెదిరింపులు, అరెస్టుల ద్వారా టీఎంసీ కార్యకర్తలను బలహీనపరిచేందుకు పోలీసులు బీజేపీకి సహకరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 'పోలీసు పాలన' నడుస్తోందని, టీఎంసీ రాజకీయ కార్యకలాపాలను అధికారులు పద్ధతి ప్రకారం అణచివేస్తున్నారని ఆరోపించారు. సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి టీఎంసీకి పోలీసులు అనుమతి ఇవ్వడం లేదని, అయినా తాము బలంగా ఎదుగుతామని తెలిపారు. ఒకరిద్దరు ఎమ్మెల్యేలను లాక్కోవడంతో టీఎంసీ బలహీనపడదన్నారు. తమ కార్యకర్తలను సమావేశాలు నిర్వహించనివ్వడం లేదని, తమను బయటకు రానివ్వడం లేదని మమత తెలిపారు. 2,500 పార్టీ కార్యాలయాలను ధ్వంసం చేశారని, ఈద్గాలను స్వాధీనం చేసుకున్నారని, మిషనరీ సంస్థలను మూసివేశారని ఆరోపించారు.

## రామగుండం యూరియా అంతా

# తెలంగాణకే కేటాయించాలి

మహారాష్ట్ర వినియోగిస్తోందని, ఆ మొత్తం నీటిని మనం తీసుకొని వారికి అవసరమైన విద్యుత్ మనం సరఫరా చేసే అంశంపై ఆ రాష్ట్ర అధికారులతో చర్చించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. గోదావరి నది నుంచి ఏటా వేల టీఎంసీల జలాలు సముద్రంలోకి వృథాగా పోతున్నాయని, వరద కూడా చాలా స్వల్ప కాలంలోనే వస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఇటు గోదావరి, అటు ప్రాణహితల వైపు నుంచి వచ్చే వరదను ఎలా మళ్లించాలనే దానిపై స్పష్టమైన విధానం రూపొందించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. డ్యామ్‌ల మెయింటెనెన్స్‌పై వివరాలను అధికారులను ఆరా తీశారు. గతంలో కడెం ప్రాజెక్టులో తలెత్తిన ఇబ్బందులను గుర్తు చేశారు. గేట్ల మరమ్మతులు, మెయింటెనెన్స్‌లకు సంబంధించి ఇప్పటికే రూ. 300 కోట్లు విడుదల చేశామని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. నిధులు ఎన్ని అవసరమైనా వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. ఈ వర్షాకాలంలో ఎక్కడైనా డ్యామ్‌ల విషయంలో ఇబ్బందులు తలెత్తితే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

### ఆ యూరియా అంతా తెలంగాణకే

మరోవైపు వాతావరణ శాఖ అంచనాలు, నివేదికలకు అనుగుణంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంటల మార్పిడి, పంటల వైవిధ్యత, తక్కువ నీరు వినియోగించుకునే పంటలు, పంట రకాల సాగుపై రైతులకు రైతు వేదికల ద్వారా అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ విషయంలో ఏఐ టెక్నాలజీతో రూపొందించిన వీడియోలను ప్రదర్శించాలని అన్నారు. టీవీ ఛానెళ్లలోనూ ఇందుకు సంబంధించిన ప్రసారాలు అయ్యేలా చూడాలని ఆదేశించారు. పంటల సాగుతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువుల సరఫరాలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రామగుండం ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తి అయ్యే యూరియా అంతా తెలంగాణకే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

### విపత్తుల నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.100 కోట్లు ఖర్చు చేయాలి

గతేడాది వరదల సమయంలో కామారెడ్డి, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించిన సమయంలో ఇచ్చిన హామీల అమలు వివరాలను అధికారులను ముఖ్యమంత్రి సీఏ రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. వరద సందర్భంగా ఇచ్చిన హామీలు, ప్రస్తుత పరిస్థితి, ఏవైనా పెండింగ్‌లో ఉంటే అందుకు కారణాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. హామీల అమలులో నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సూచించారు. వడగాలులు, వరదల సమయంలో ప్రజలు ప్రాణాలు, ఆస్తులు కోల్పోయినప్పుడు వెంటనే ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి బాధిత కుటుంబాలకు పరిహారం అందేలా చూడాలన్నారు. వరదల సమయంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, కూలిన వంతెనల స్థానంలో నూతన వంతెనల నిర్మాణం, ఇతర పనులకు విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000 కోట్లను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మించాలి

క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో వర్షాకాలంలో రోడ్లపై వరద నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. నీరు నిలిచే 141 ప్రదేశాలను గుర్తించి వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మించాలని గతంలో నిర్ణయించామని, వాటి పురోగతిపై వివరాలను సీఎం రేవంత్ రెడ్డి అడిగితెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, వాటి పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీనియర్ అధికారి జయేశ్ రంజన్‌ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలో ఏ ప్రాంతాలోనూ తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.విద్యుత్ శాఖ వర్షాకాలానికి అవసరమైన సామగ్రిని ముందుగానే సమీకరించుకోవాలని సూచించారు. గాలి, దుమ్ము, భారీ వర్షాల పడిన సందర్భాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నపుడు, లైన్లు తెగిపోయి సరఫరా నిలిచినప్పుడు తక్షణమే స్పందించి మరమ్మతులు పూర్తి చేసి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. జిల్లాల స్థాయిలో కలెక్టర్లు, ఎస్పీలు నిర్ణీత సమయంలో భేటీ అవుతూ ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో ముందుకు సాగితే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## సీఎంగా తొలి సభలోనే విజయ్ ఫైర్

రాజీకి ఆస్కారం లేదని, తాము రాష్ట్ర హక్కులను ఎప్పటికీ వదులుకోమని విజయ్ తెలిపారు. నదీ జలాలపై తమ హక్కులను ఎప్పటికీ వదులుకోమన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సామాజిక న్యాయం, సమాన న్యాయం, సమానత్వం అమలు చేస్తామన్నారు.ఇప్పుడు ప్రజలు తనను పెరంబూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అని పిలుస్తున్నారని, అది కేవలం ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారమే అన్నారు. కానీ తన వరకు అయితే, తిరుచిరాపల్లి నియోజకవర్గ ప్రజలు కూడా తన హృదయానికి చాలా చాలా దగ్గర అని విజయ్ తెలిపారు. తాను కోటు వేసుకోవడం గురించి చాలా మంది మాట్లాడుతున్నారని, ఎందుకు? మనం కోటు, సూట్ వేసుకోకూడదా? కేవలం అధికారంలో ఉన్నవారు, ఆధిపత్య శక్తులు మాత్రమే కోట్లు, సూట్లు వేసుకోవాలా? ఈ రెండు రంగులు మనిషి మనసులోని రెండు పార్శ్వాలను ప్రతిబింబిస్తాయన్నారు. తనకు ఫ్యాన్సీ రంగుల దుస్తులు వేసుకోవాలని లేదన్నారు.

## పవన్ కళ్యాణ్‌కు షాకిచ్చిన తెలంగాణ పోలీసులు



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన సభకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఈ సభకు తెలంగాణ పోలీసులు అనుమతి నిరాకరించడం గమనార్హం. తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ నిర్వహించాలని జనసేన పార్టీ ప్లాన్ చేయగా దానికి పవన్ కళ్యాణ్ హాజరు కానుండగా ఈ నేపథ్యంలోనే ఇప్పుడు సైబరాబాద్ పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో జనసేన నేతల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయాలని భావిస్తుండగా ఇందుకోసం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించాలని జనసేన నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభను నిర్వహించేందుకు ఇప్పటికే జనసేన పార్టీ నేతలు ఏర్పాట్లు చేశారు. ఈ సమయంలోనే ఈ సభకు పోలీసుల అనుమతి లేకపోవడం ఆ పార్టీకి ఎదురుదెబ్బగా మారింది. అయితే తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభకు తెలంగాణ పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో జనసేన పార్టీ నేతలు న్యాయపోరాటం చేసేందుకు రెడీ అయినట్లు తెలుస్తోంది. సైబరాబాద్ పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఈ నిర్ణయంపై కోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే తెలంగాణలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు పవన్ కళ్యాణ్‌పై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న వేళ ఈ సభ ఏర్పాటు చేయడం, దానికి పోలీసులు అనుమతి నిరాకరించడం తీవ్ర దుమారం రేపుతోంది.

# కత్తులు, కటార్లతో వస్తే చూస్తూ ఊరుకోం

ఈ సందర్భంగా వైసీపీ నేతలను ఏకిపారేశారు.

### సుపరిపాలన చూసి ఓర్వలేకే కుతంత్రాలు

గత ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తుంటే, వైసీపీ ఇంకా విధ్వంసాన్ని కొనసాగించే ప్రయత్నంలోనే ఉందని చంద్రబాబు విమర్శించారు. "సుపరిపాలన చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. వివేకానంద రెడ్డిని గొడ్డలితో నరికి చంపి గుండెపోటు డ్రామా ఆడారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి కోడికత్తి, గులకరాయి నాటకాలతో ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు అధికారం కోల్పోయాక కూడా వారి బుద్ధి మారలేదు" అని మండిపడ్డారు.

ఇటీవల జరిగిన పలు ఘటనలను ప్రస్తావిస్తూ వైసీపీ కుట్రలను ఆయన ఎండగట్టారు. "పరామర్శకు వెళుతూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపి పొదల్లో పడేశారు. ఇటీవల కడపకు చెందిన ఓ పాస్టర్‌ను పంపి మాపై హత్యాయత్నం డ్రామా ఆడారు. అంతకుముందు పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి ప్రమాదంలో చనిపోతే, దాన్ని కూడా మాకు అంటగట్టాలని చూశారు. సీసీకెమెరాలతో ఈ కుట్రలు బట్టబయలత్తాయ్యాయి. సాక్షాత్తు తిరుమల కొండపై సాక్షి మీడియా ప్రతినిధులే మద్యం బాటిళ్లు పడేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నించారు. కడపలో పెద్ద దస్తగిరిని ఆస్తుల వివాదంలో వైసీపీ వారే హత్య చేసి, టీడీపీపై నెపం మోపజూశారు. చివరికి నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది కూడా వైసీపీ కార్యకర్తే. అందుకే ఆ వార్తను సాక్షి పత్రికలో రాయలేదు. కాకినాడలో దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీకి వైసీపీ సన్మానాలు చేసింది. ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్న వారి ఆటలు సాగనీయం" అని చంద్రబాబు హెచ్చరించారు.

### విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి

జూన్ 4వ తేదీ రాష్ట్ర చరిత్రలో విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి కలిగిన రోజుగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు. "గత పాలనలో ప్రజలు బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ భయం పోయింది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పేదల కోసం పనిచేస్తున్నాం. రూ.10 లక్షల కోట్ల అప్పులున్నా, పెన్షన్లను రూ.1,000 పెంచి రూ.4,000 చేశాం. దివ్యాంగులకు రూ.6,000, ఆరోగ్య పెన్షన్లను రూ.10,000, రూ.15,000కు పెంచాం. 2024 జూలై నుంచి ఇప్పటివరకు రూ.65,887 కోట్లు ఎన్టీఆర్ భరోసా కింద అందించాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదు," అని చంద్రబాబు వివరించారు. బటన్ నొక్కితే పైశాచిక ఆనందం తప్ప, ప్రజల కష్టాలు తెలియవని, అందుకే ప్రతీ నెలా ఒకటో తేదీన నేరుగా ప్రజల వద్దకే వచ్చి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు.

### సంక్షేమంతో పాటు ఉపాధి, అభివృద్ధి

సంక్షేమంతో పాటు అభివృద్ధి, సుపరిపాలన అందిస్తూనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం. కాకినాడ సమీపంలో రూ.80 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ, అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తున్నాయి. పీఎం సేతు కింద ఏటా 25 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తాం. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పునరుద్ధరించాం. ఎన్నో ఏళ్ల కల అయిన విశాఖ రైల్వే జోన్ కూడా సాకారమైంది" అని ముఖ్యమంత్రి ప్రకటించారు. పోలవరం ఎడమ కాలువను జూలైలోగా పూర్తి చేసి విశాఖకు నీరందిస్తామని హామీ ఇచ్చారు.

### ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "పాఠశాలల్లో సంస్కరణలు తెచ్చి నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖరీదైన వైద్యం కోసం అప్పులపాలు కాకుండా 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' తెస్తున్నాం. 'సంజీవని' పేరుతో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం," అని తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ ద్వారా రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలబెడతామని, శ్రీకాకుళం, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని పునరుద్ఘాటించారు.

### దివ్యాంగుడిని ఆప్యాయంగా పలకరించిన చంద్రబాబు

సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి, పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకే 'పీ4' (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులుగా నిలుస్తున్న 'బంగారు కుటుంబాల'తో ఆయన మాట్లాడారు. అనంతరం, వేదిక వద్దకు వచ్చిన ఓ దివ్యాంగ అభిమానిని ఆప్యాయంగా పలకరించి, అతని భుజంపై చేయి వేసి ఫొటో దిగారు. అతనికి ప్రభుత్వ సహకారం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి. నారాయణ, ఎమ్మెల్యే యనమల దివ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మా జోలికి వస్తే మూతి పళ్లు రాలుతాయి

మొండిదాన్ని అని మీరు అనుకున్నంత మంచిదాన్ని కాదని కవిత తేల్చి చెప్పారు. తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణలో ఉన్న ఆంధ్రా నేతల విగ్రహాలు పగలగొట్టి ఆంధ్రాకు పార్సిల్ పంపిస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తూ ఏపీ సంస్కృతిని తమపై రుద్దుతామంటే చూస్తూ ఊరుకునేది లేదంటూ కల్వకుంట్ల కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని కవిత తేల్చి చెప్పారు. టీఆర్ఎస్ రాకముందు ఒక లెక్క ఇప్పుడు ఒకలెక్క అంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇది టీఆర్ఎస్ 2.0 అని తమతో పెట్టుకుంటే మంచిగా ఉండదని స్పష్టం చేశారు. ఒకసారి తెలంగాణతో పెట్టుకుంటేనే రాష్ట్రాన్ని తెచ్చుకున్నామని మళ్లీ తమ జోలికి వస్తే ఊరుకోమని, మూతి పళ్లు రాలుతాయని హెచ్చరించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డిపై పరోక్షంగా విమర్శలు గుప్పించిన కవిత తెలంగాణలో ఆంధ్రా రాజకీయ నాయకుల ఏజెంట్ ముఖ్యమంత్రిగా ఉన్నారనీ అందునే ఆంధ్రా నాయకుల విగ్రహాలు పెడుతూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఇదేదో యాదృచ్ఛికంగా జరుగుతున్నది కాదని ఒక పక్కా ప్రణాళిక ప్రకారం తెలంగాణ అస్తిత్వంపై కుట్ర చేస్తున్నారని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్, పాశం యాదగిరి లాంటి మేధావులు మాట్లాడితే ఆంధ్రా పోలీసులు వచ్చి ఎదురుదాడి చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ఇక రాష్ట్రం విడిపోయి 13 ఏళ్లు అవుతున్నా ఏపీలో రాజధానిని కట్టుకోవడం చేతగాక అక్కడి ప్రజలను డైవర్ట్ చేయడానికి ఇక్కడ డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. రాజధాని నిర్మాణంలో పూర్తిగా ఫెయిల్ అయ్యారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో జనసేన పార్టీ నవ నిర్మాణ సభ పెట్టేముందు తెలంగాణ ప్రజలకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు.

## నెలరోజుల్లోనే ఇల్లు నిర్మాణం.. సరికొత్త టెక్నాలజీ

ఈ క్రమంలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా సాగాలని సూచించారు. అటు లబ్ధిదారులకు, ఇటు అధికారులకు కూడా ఈ సందర్భంగా కీలక సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణం శరవేగంగా పూర్తి చేసుకునేందుకు కొత్త టెక్నాలజీని తీసుకువస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ టెక్నాలజీతో కేవలం నెల రోజుల్లోనే ఇల్లు నిర్మాణం పూర్తి అవుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.తండాలు, గూడెంలలో నివసించే అర్హులైన ఆదివాసీల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వంద శాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను తాను చూడాలనుకుంటున్నానని తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీన రాష్ట్రంలో మరో లక్ష ఇందిరమ్మ ఇళ్లకు గృహ ప్రవేశాలు చేస్తామని ప్రకటించారు.ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఖర్చు చేసిన రూ. లక్ష కోట్లు గోదావరి నదిలో కలిసిపోయాయని మండిపడ్డారు. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులను పట్టించుకోలేదని ఆరోపించారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి.. ఆదిలాబాద్ జిల్లాలోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం కోసం చర్చించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రికి ఎన్నో లేఖలు రాసినట్లు గుర్తు చేసిన సీఎం రేవంత్ రెడ్డి అయినా ఎలాంటి స్పందన లేదని విమర్శించారు.తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర సీఎంకు ఎందుకు అంత చిన్నచూపు అని ప్రశ్నించారు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన విషయాన్ని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి తుమ్మిడిహట్టి ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని తామే భరిస్తామని మహారాష్ట్ర నుంచి 2 వేల ఎకరాలు మాత్రమే అడుగుతున్నట్లు చెప్పారు. ఇక తెలంగాణలో ఇప్పటి వరకు 62 లక్షల క్వింటాళ్ల వడ్లను తమ ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. మొత్తం 75 లక్షల క్వింటాళ్ల వడ్లను కొంటామని స్పష్టం చేశారు. ఈనెల 15వ తేదీ నాటికి ఈ కొనుగోళ్లు పూర్తి అవుతాయని తెలిపారు. తాము సేకరించిన వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అందుకు కిషన్‌రెడ్డి సహకారం అందించాలని వడ్లు కొనకపోతే ఈనెల 15వ తేదీ తర్వాత కేంద్రంపై యుద్ధం చేస్తామని రేవంత్ రెడ్డి తీవ్ర హెచ్చరికలు చేశారు.

# ఏపీకి ఎయిర్ ట్రంక్

'ఎయిర్‌ట్రంక్ ఫ్యూచర్ క్యాంపస్'ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "విశాఖపట్నం వేగంగా ఏఐ, డేటా హైపర్‌స్కేల్ హబ్‌గా ఆవిర్భవిస్తోంది. ఇప్పటికే గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ ఏఐ డేటా సెంటర్, అదానీకనెక్స్ వంటి దిగ్గజ సంస్థల ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖ అన్ని విధాలా అనుకూలమైన నగరం. ఇక్కడ 6 గిగావాట్ల డేటా సెంటర్లను నెలకొల్పాలన్నది మా లక్ష్యం. మల్టీ-గిగావాట్ ఏఐ మౌలిక సదుపాయాలు, సంపూర్ణ ఎకోసిస్టమ్ అభివృద్ధిపై మేం ప్రత్యేక దృష్టి సారించాం" అని వివరించారు.భారతదేశంలో మరే ఇతర ప్రాంతంలో లేని కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు ఏపీలో అందుబాటులో ఉన్నాయని, డేటా సెంటర్లకు అవసరమైన నిరంతర విద్యుత్ కోసం పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు కూడా సిద్ధంగా ఉన్నాయని లోకేష్ తెలిపారు. ఎయిర్‌ట్రంక్‌ను ఏపీకి తీసుకురావాలన్న ప్రయత్నాలు గత కొంతకాలంగా జరుగుతున్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా తొలిసారి రాబిన్ ఖుదాతో సమావేశమై ఏపీ దార్శనికతను వివరించారు. ఆ తర్వాత ఎయిర్‌ట్రంక్ బృందం, ఆంధ్రప్రదేశ్ ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చలు జరిపింది. అయితే, భారత్‌లో కార్యకలాపాలకు ఒక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసుకున్న తర్వాతే విస్తరణపై నిర్ణయం తీసుకుంటామని అప్పట్లో ఎయిర్‌ట్రంక్ తెలిపింది.ఈ నేపథ్యంలో, ఎయిర్‌ట్రంక్ ఈ ఏడాది ఏప్రిల్‌లో అధికారికంగా భారతదేశంలోకి ప్రవేశించింది. బ్లాక్‌స్టోన్ మద్దతు ఉన్న డేటా సెంటర్ ప్లాట్‌ఫాం 'లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రా'ను టేకోవర్ చేసింది. ఈ స్వాధీనంతో ముంబయి, చెన్నై, హైదరాబాద్‌లలో సుమారు 600 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులు ఆ సంస్థ చేతికి వచ్చాయి. ఇది ఎయిర్‌ట్రంక్‌కు భారత్‌లో తక్షణ కార్యకలాపాలకు మార్గం సుగమం చేసింది. తమ ఆసియా పసిఫిక్ వ్యూహంలో భారత్‌ను ఒక ప్రధాన వృద్ధి మార్కెట్‌గా ఆ సంస్థ గుర్తించింది. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో, లోకేష్ మరోసారి రాబిన్ ఖుదాతో భేటీ అయి, ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. దీనిపై రాబిన్ ఖుదా స్పందిస్తూ... ఎయిర్‌ట్రంక్ భారత ప్రణాళికలు, లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రా ఏకీకరణ, భవిష్యత్ విస్తరణ రోడ్‌మ్యాప్ వంటి అంశాలను చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను నిశితంగా పరిశీలించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ భేటీతో విశాఖలో మరో భారీ పెట్టుబడికి మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'

సువర్ణావకాశాన్ని కల్పిస్తోందని, దేశ నిర్మాణంలో యువత ప్రధాన పాత్ర పోషించాలనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనల నుంచే ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఇది సాధారణ పార్టీ చేరికల లాంటి కార్యక్రమం కాదని, సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరినీ వారి రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా ఆహ్వానిస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ టాలెంట్ హంట్ ద్వారా పార్టీ అధికారిక ప్రతినిధులను పూర్తిగా పారదర్శకమైన పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ వ్యవహారాలపై బలమైన అవగాహన ఉండటం, లౌకికవాదం పట్ల పూర్తి నిబద్ధత కలిగి ఉండటం, సామాజిక సేవపై నిజమైన ఆసక్తితో పాటు ప్రజలతో సమర్థవంతంగా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారిని ఈ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. సాంప్రదాయ రాజకీయ సంబంధాలు లేకపోయినా కేవలం ప్రతిభ, స్పష్టమైన విజన్, సేవా దృక్పథం ఉన్న మంచి వ్యక్తుల కోసం కాంగ్రెస్ పార్టీ ఈ వేదికను అందిస్తోందని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. వారసత్వ రాజకీయాలకు భిన్నంగా, క్షేత్రస్థాయి నుంచి సరికొత్త రక్తాన్ని పార్టీలోకి ఆహ్వానించడానికి కాంగ్రెస్ వేసిన ఈ అడుగు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశావహ యువతలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## ధాన్యం కొనుగోళ్లలో ఎందుకు ఈ నిర్లక్ష్యం.?

అని రాంచందర్ రావు ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపైనే ధాన్యం కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కొనుగోళ్లను ఆలస్యం చేస్తోందని, దిగుబడికి సంబంధించిన సరైన గణాంకాలను కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రాలు సేకరించిన ధాన్యానికి మాత్రమే కేంద్రం నిధులు రీయింబర్స్ చేస్తుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం వల్లే రైతులకు ఈ దుస్థితి దాపురించిందని గుర్తుచేశారు.ధాన్యం తరలింపులో జరుగుతున్న జాప్యంపై బీజేపీ చేసిన ఆందోళనలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. బీజేపీ నిరంతరాయంగా చేసిన నిరసనలు, పోరాటాల వల్లే ఎట్టకేలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించాల్సి వచ్చిందని అన్నారు. బీజేపీ ఒత్తిడి వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం అంతో ఇంతో కదిలిందని చెప్పారు. రైతుల వద్ద మిగిలి ఉన్న ప్రతి ధాన్యం గింజను ఎలాంటి ఆలస్యం లేకుండా తక్షణమే యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే సమావేశంలో నేడు ఢిల్లీలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు రాంచందర్ రావు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ గడ్కరీతో పాటు పలువురు కేంద్ర సీనియర్ నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీ జాతీయ నాయకత్వం ఇప్పుడు తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన స్పష్టం చేశారు

# పిడుగురాళ్ల లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

- పాల్గొన్న గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు



**పిడుగురాళ్ల** :పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల పట్టణంలోని 16 వ వార్డు కుమ్మరి పాలెం నందు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొని ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిడుగురాళ్ల పట్టణంలోని 16వ వార్డుకు చెందిన వివిధ రకాల పింఛన్ దారులకు పింఛన్లను పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల పట్టణ టిడిపి అధ్యక్షులు పిల్లి చెన్నారావు, జీడిసిసి మాజీ డైరెక్టర్ వడ్డవల్లి సర్వేశ్వరరావు, గురజాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్డవల్లి సాంబశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ తురకా వీరస్వామి, మండల జనసేన పార్టీ అధ్యక్షులు కామిశెట్టి రమేష్, పట్టణ టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు కార్ సైదా, మున్సిపల్ కమిషనర్ ఇరువూరి శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, మరియు సచివాలయ సిబ్బంది, పింఛన్ లబ్ధిదారులు, పిడుగురాళ్ల పట్టణంలో వివిధ హోదాల్లో వున్న కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

# గురుకులాల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వాస్తవాలు గ్రహించాలి**

**- జీఓ 17ను వెంటనే రద్దు చేయాలి**

**- ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ జేఏసీ డిమాండ్**




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నం.17ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్స్ జాయింట్ ఆక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి కొంకటి శేఖర్ మాట్లాడుతూ, జీఓ 17 వల్ల బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని వర్గాలకే ప్రాధాన్యం ఇస్తోందని, గురుకులాల్లో విద్యార్థుల సమస్యలు, మరణాలపై స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వం వైఖరిని సమర్థించడం మానుకుని వాస్తవ పరిస్థితులను గుర్తించాలని సూచించారు. జీఓ 17ను రద్దు చేసే వరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కంచర్ల రవి గౌడ్, గుండు ప్రేమ్ కుమార్, పొన్నాల నర్సింలు, శాగ దేవేందర్, లింగంపల్లి మధూకర్, పూర్ణచందర్ గౌడ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# బషీరాబాద్ లో అక్రమ మైనింగ్ బట్టబయలు

**- అక్రమ మొరం తవ్వకాలపై చీతా ఫోర్స్ మెరుపు దాడి**

**- జేసీబీ, ఐదు ట్రాక్టర్లు స్వాధీనం**



కమ్మర్ పల్లి.(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు, సీసీఎస్ ఏసీపీ ఇంచార్జి మస్తాన్ అలీ పర్యవేక్షణలో చీతా ఫోర్స్ బృందం కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బషీరాబాద్ గ్రామ శివారులో అక్రమ మొరం తవ్వకాలపై మెరుపు దాడి నిర్వహించింది.కాడి చెరువు వద్ద అక్రమంగా మొరం తవ్వి తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, తవ్వకాల కోసం ఉపయోగిస్తున్న ఒక జేసీబీతో పాటు ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను తదుపరి చర్యల కోసం కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు.అక్రమ మైనింగ్, మొరం, ఇసుక, మట్టి తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, సహజ వనరుల అక్రమ దోపిడీకి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య హెచ్చరించారు.

# మోహినీ మూర్తిగా భక్తులను మంత్రముగ్ధులను చేసిన కల్యాణ శ్రీనివాసుడు

**పల్లకిపై దివ్య విహారం భక్తులకు ఆధ్యాత్మిక పరవశం**

**రాత్రి గరుడవాహనంపై మహా వైభవ దర్శనం**



నారాయణవనం(ప్రశ్న న్యూస్)శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం స్వామివారు మోహినీ అలంకారంలో పల్లకిపై దివ్యంగా విహరించి భక్తులకు కనువిందు చేశారు.ఉదయం 8 గంటలకు గ్రామ వీధుల్లో విహరించిన స్వామివారు భక్తులను అనుగ్రహిస్తూ కటాక్షించారు. వాహనం ముందు భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో గోవింద నామస్మరణ చేస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి పల్లకి సేవ అత్యంత వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకుని పులకించిపోయారు.

### మోహినీ అవతార మహిమ

అసురులను మోహింపజేసి దేవతలకు అమృతాన్ని అందించేందుకు శ్రీమహావిష్ణువు మోహినీ అవతారాన్ని ధరించినట్లు పురాణాలు వివరిస్తున్నాయి. మోహినీ అలంకారంలో శ్రీనివాసుని దర్శించుకున్న భక్తులు మాయా బంధాలను అధిగమించి ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలనే సందేశాన్ని ఈ అవతారం అందిస్తోంది.

### రాత్రికి గరుడవాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన గరుడవాహన సేవ సోమవారం రాత్రి 7 గంటల నుండి జరగనుంది. గరుడునిపై కొలువుదీరే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బాషా సంయుక్తము కాదు మాది తెలంగాణనే



తెలంగాణ' అనే పదం ఇప్పుడు ఒక ప్రత్యేక భౌగోళిక వ్యక్తిత్వంగా, రాష్ట్రంగా, అస్తిత్వ కేతనంగా, ఒక జాతి ప్రతీకగా ఉంది. తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో 'తెలంగాణ' అనే పదం సామూహిక శక్తి సంకేతంగా, సింగిల్ లైన్ ఎజెండాగా, సకలజనులనూ ఉద్దీపింప చేయగలిగింది. 1905లో భారతదేశంలో 'వందేమాతరం' నినాదం ఎంత బలమైన ఐక్యతా స్ఫూర్తిని ప్రజల్లో కలిగించగలిగిందో, జైతెలంగాణ' నినాదం అంతే సంఘటితవైఖరిని తెలంగాణ ప్రజలందరిలో పాదుకొల్పింది. ఇంతటి ప్రభావశీలమైన 'తెలంగాణ' పదం భాషా పరంగా ఎప్పుడు పుట్టింది? దీని ఆవిర్భావం ఎలా జరిగింది? ఈ పదానికి ఉన్న ప్రాచీనత ఏమిటి? అనేవి ఎంతో ఆసక్తిని కలిగించే అంశాలు.భాషలోని పదాలు, వాటి పుట్టుక, పరిణామాలు గురించి అధ్యయనం చేసే పదోత్పత్తి శాస్త్రం, నియమాలను అనుసరించి తెలంగాణ' పదోత్పత్తిని పరిశీలిస్తే ఎన్నో విషయాలు వెల్లడి అవుతాయి. వాటిలో ప్రముఖ చరిత్రకారుడు ఆదిరాజు వీరభద్రరావు తెలుగు నేల అంతటినీ త్రిలింగాల మధ్య విస్తరించిన దేశంగా భావించి కాళేశ్వరం, ద్రాక్షారామం, శ్రీశైలం అనే త్రిలింగశైవ పుణ్యక్షేత్రాల మధ్య ఉండే భాగంగా చెపుతూ, ఈ ప్రాంతం త్రిలింగ దేశంగా,శివకవిగా ప్రజాసాహిత్యానికి, దేశ సంప్రదాయానికి ప్రాధాన్యత ఇచ్చిన పాల్కురికి తన 'బసవపురాణం'లో రాసిన ఈ ద్విపదలో 'తెనుంగు' 'తెలుగు' పదాలను భాషగా ప్రస్తావించారు."ఉరుతర గద్య పద్యోక్తుల కంటె సరసమై బరగిన జాను తెనుంగు చర్చింపగా సర్వసామన్యముగుటు– గూర్చెద ద్విపదుల

**తెలుగు మాటలనంగ వలదు**

**వేదముల కొలది యగా**

**జాడుడిలనెట్టులనిన"**

అదే విధంగా ఆయనే రాసిన 'పండితారాధ్య చరిత్ర'లో కూడా/ "ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ పూరిత సంస్కృత భూయిష్ట రచన మానుగా/ సర్వ సామాన్యంబు గామి జాను తెనుగు విశేషము ప్రసన్నతకు'' అని ప్రస్తుతించారు. ఇక్కడ తెనుంగు, తెనుగు' పదాలను భాషగా వ్యక్తీకరించినప్పటికీ ఈ పదాలను ప్రదేశముకు సమానార్థకమైన 'అసము' 'ఆనెము' లను జత పరిస్తే (తెనుంగు ం అసము లేదా తెనుగు ఆనము లేదా తెలుంగా ం అనము) తెలంగానము' అనే ప్రాంత వ్యక్తీకృత పదం ఏర్పడుతున్నది.

### ఈ విధంగా 'త్రిలింగ దేశ భావన నుంచి అలాగే 'త్రిలింగ్,

బోధన్, కోటిలింగాల, దూళికట్ట, కొండాపురం, ఫణిగిరి, గాజుల బండ్ల మొదలైన ప్రాంతాలన్నీ ప్రస్తుత తెలంగాణ ప్రాంతంలో ఉన్నవే. యాదృచ్చికంగా ఈ ప్రాంతాలన్నీ బౌద్ధ, జైన మత పరమైన అంశాలకు ఆవాసాలుగా ఉండడం విశేషం!

అలాగే క్రీస్తు శకం రెండవ శతాబ్దంలో భారతదేశాన్ని టాలమీ అనే గ్రీకు భౌగోళిక శాస్త్రజ్ఞుడు సందర్శించాడు. టాలమీ తన గ్రంథంలో "త్రిలింగాన్" అనే ప్రస్తావన చేశాడు. దీనిని కొంతమంది చరిత్రకారులు తెలంగాణకు సంబంధించింది అని భావించారు. అయితే ఆ గ్రంథాన్ని పరిష్కరించిన మరికొంతమంది చరిత్రకారులు ఈ పదం ఒక ప్రాంతానికి సంబంధించిన పేరు కాదని అది గంగా నది పరివాహక ప్రాంతంలోని ఒక నగరం పేరు అని వెల్లడించారు. కనుక టాలమీ ప్రస్తావించిన 'త్రిలింగాన్కు దక్షిణ భారత దేశంలో నెలవైన తెలంగాణకు సంబంధం ఉందా అనే విషయంపై మరింత పరిశోధన జరగాల్సి ఉంది.ఇక 1870 ప్రాంతంలో బ్రిటిష్ లైబ్రరీలో పుస్తకాలను అధ్యయనం చేయడం ద్వారా తన వాదానికి, సిద్ధాంతానికి పదును పెట్టుకున్న వారిలో గొప్ప తత్వవేత్త కార్ల్ మార్క్స్ కూడా ఒకరు. ఆయన ఆ లైబ్రరీలో అధ్యయనం చేస్తున్న కాలంలో తాను రాసుకున్న 'నోట్స్ ఆన్ ఇండియన్ హిస్టరీ' అనే చిత్తుప్రతిలో తెలంగాణ అనే పదాన్ని ఐదుచోట్ల వాడాడు.

### తెలంగాణ తెలంగాణే..

ఆ తర్వాత క్రమంగా తెలంగాణ'గా మారిందని అభిప్రాయపడ్డారు.

అలాగే తెలంగాణం అనే పదం "తిలింగ" లేదా "తెలింగా" మరియు "ఆనము" (అంటే ప్రదేశం) అనే పదాల కలయికతో వచ్చిందని చెప్పడానికి భాషాపరంగా యుక్తత 'త్రిలింగా' శబ్దమే క్రమంగా 'తిలింగాన'గా మారి 'తెలంగాణ'గా వ్యవహారంలోకి వచ్చిందని అనిపిస్తుంది. ఈ కోణం నుంచి అలోచిస్తే త్రిలింగ ్ర ఆనము (ప్రదేశము) = త్రిలింగానము అనే భావన నుంచి తెలంగాణా పేరు క్రమంగా రూపాంతరం చెంది ఉండవచ్చు అనేది ఒక వాదన. ద్రావిడ భాషలో "తెలుగు'' అంటే "దక్షిణం" అనే అర్థం ఉంది. తెలుగు ప్రాంతం అనగానే దక్షిణ ప్రాంతం అనీ, 'ఆనం' అంటే ప్రదేశం అనీ, తెలుగు ఆనం అంటే దక్షిణ ప్రాంతంలోని భూభాగము అని కూడా తెలుస్తుంది.మహమ్మదీయ చరిత్రకారులు ఈ భూభాగాన్ని 'తిలింగ్' అని వ్యవహరించారు. అంటే తిలింగ్ ప్రాంతవాసులు తైలంగులుగా, తెలంగాణులుగా క్రమంగా పిలువబడ్డారు అనేది మరొక వాదన.ఇలా 'త్రిలింగ', 'తిలింగ, 'తెలింగ, తెలంగు తెనుంగు, తెనుగు పదాల నుండీ తెలంగాణ' పదం ఆవిర్భవించిందనేది నిరూపణ అవుతున్నప్పటికీ సాహిత్యపరంగా ఈ పదాల ప్రస్తావన మనకు పురాణాల కాలం నుండే కనిపించడం విశేషం.అష్టాదశ పురాణాలలో ప్రముఖ పురాణం 'స్కందపురాణం. ఇందులో త్రిలింగ దేశం ప్రస్తావన మనకు కనిపిస్తుంది. శ్రీశైలం, ద్రాక్షారామం, కాళేశ్వరం మహేంద్రగిరి ప్రాకారంగా ఉన్న దేశం త్రిలింగ దేశమని ఈ పురాణంలో ఉటంకించగా, వాయు పురాణంలో "తిలింగుల జనపదం" అనే పేరుతో ప్రస్తావించారు. ఇది భారతదేశ మధ్య భాగంలో ఉన్న జనపదాలలో ఒకటిగా ఈ పురాణం పేర్కొంది. ప్రస్తుత భౌగోళిక విస్తరణను అనుసరించి చూసినా ఇది సరిగానే ఉన్నట్లుగా అనిపిస్తుంది. నన్నయ రాసిన శ్రీ మదాంధ్ర మహాభారతంలోని ఆది పర్వంలో కూడా త్రిలింగ ప్రాంత ప్రస్తావన మనకు కనిపిస్తుంది.దేవగిరిని పాలించిన యాదవ రాజుల మంత్రి హేమాద్రి తాను రాసిన "వ్రత ఖండం" అనే గ్రంథంలో ఈ త్రిలింగ పదాన్ని ప్రయోగించారు. ఆయన కాకతీయ ప్రభువు రుద్ర దేవున్ని "త్రిలింగ అధిపతి'గా వర్ణించాడు. త్రిలింగములకు ఆలయాలను నిర్మించిన ప్రదేశాన్ని పరిపాలించే కాకతీయ ప్రభువుని త్రిలింగ అధిపతిగా ఇక్కడ చెప్పారు.త్రిలింగ, తిలింగకు రూపాంతరంగా భాషావేత్తలు చెప్పిన తెనుంగు, తెనుగు, తెలుగు, పదాలను 13వ శతాబ్దికి చెందిన పాల్కురికి సోమన కూడా తన రచనలలో ఉదహరించాడు'తెలింగ్, తెలుగు' వంటి పదాల నుంచి కూడా 'తెలంగాణం' అనే పదము రూపాంతరం చెందిందని చెప్పడానికి కావలసిన సాహిత్య ఆధారాలు, చారిత్రక ఆధారాలు మనకు లభిస్తున్నాయి.గోండ్వానా భూమిలో భాగంగా తెలంగాణా ప్రాంతం మొదటి నుంచీ ప్రత్యేక భౌగోళిక, నైసర్గిక విశిష్టతలను కలిగి ఉన్నప్పటికీ, ఆ ప్రాంతానికి మాత్రం తెలంగాణా అనే పేరు మాత్రం ఏర్పడలేదు. షోడష మహా జనపదాలు రూపొందిన క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికే తెలంగాణా ప్రాంతం "అస్మక రాజ్యం'గా ఒక మహాజనపదంగా గుర్తింపు పొందినప్పటికీ తెలంగాణగా దానికి గుర్తింపు రూపొందలేదు.అయితే భౌగోళికంగా ఉనికిలో ఉన్న తెలంగాణ ప్రాంతానికి గుర్తింపు పరంగా, పేరు పరంగా 'తెలంగాణ'గా ఎప్పటి నుంచి ఉనికి ఏర్పడింది? – అనేది చాలా కాలంగా చరిత్రకారులను, పరిశోధకులను వేదిస్తున్న ప్రశ్న. ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ మనకు లభిస్తున్న సాహిత్య చారిత్రక, శాసన ఆధారాలను అనుసరించి తెలంగాణ' ప్రాంతంగా ఏ కాలం నుంచి ఉనికిలో ఉంది? రాజ్యంగానో, ప్రదేశంగానో ఎప్పటి నుంచి వాడుకలో ఉంది? అనే ప్రశ్నలు ఎంతో ఉత్సుకతను కలిగిస్తాయి.ఆమాటకొస్తే భాషాపరంగా, తెలంగాణ' అనే పదానికి ఉండే ప్రాచీనత గురించి ఎన్ని చారిత్రక, సాహిత్య పరిశోధనలు జరిగాయో, ప్రాంత పరంగా 'తెలంగాణ' అనే అంశంపై కూడ అన్నే చారిత్రక సాహిత్య పరిశోధనలు జరిగాయి. వాటిలో సాహిత్య ఆధారాల ప్రాతిపదికగా జరిగిన పరిశోధనలు, శాసనపరమైన ఆధారాల ప్రాతిపదికగా జరిగిన పరిశోధనలు ప్రధానమైనవి.సాహిత్య ఆధారాల విషయానికొస్తే 'తెలంగాణ' అని కాక పోయినా, తెలంగాణాలోని ఇతర ప్రాంతాల ప్రస్తావన మొదటిసారిగా చేసినది ఓ విదేశీ యాత్రికుడు కావడం. విశేషం! అతనే మెగస్తనీస్, క్రీస్తుపూర్వం 4వ శతాబ్దిలో భారతదేశానికి వచ్చిన గ్రీకు రాయబారి మెగస్తనీసు 'ఇండికా' అనే గ్రంథాన్ని రాశాడు. అలాగే ఆ తర్వాత 3వ శతాబ్దిలో వచ్చిన ప్లినీ అనే మరో విదేశీ యాత్రికుడు కూడా తన యాత్ర విశేషాలను గ్రంథస్థం చేసారు. వీరు వారి గ్రంథాలలో భారత దేశానికి సంబంధించిన ఆకాలంనాటి ఎన్నో విశేషాలని చెపుతూ, దక్షిణ భారతదేశంలో ఒక శక్తివంతమైన ప్రాంతం ఉందని, దాని పరిధిలో అనేక గ్రామాలు, 30 పైగా పట్టణాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలా వారు పేర్కొన్న పట్టణాలలో 1857లో భారత దేశంలో సంభవించిన ప్రథమ స్వాతంత్ర సంగ్రామంపై ఎంతో ఆసక్తిగా ఎన్నో విషయాలను అధ్యయనం చేస్తున్న క్రమంలో కార్ల్ మార్క్స్ ఈ అంశాలను ప్రస్తావించాడు అని తెలుస్తోంది.ఇక క్రీస్తుశకం 1310 ప్రాంతంలో ఢిల్లీ సుల్తానుల కాలము నాటి చరిత్రకారుడు, కవి ఆమీర్ ఖుస్రో రచనల్లో కూడా తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన పదాల ప్రస్తావన కనిపిస్తుంది. కాకతీయ సామ్రాజ్యం మీదికి ఢిల్లీ సుల్తానుల దండయాత్రలు 1310–1312లో ఆ తర్వాత 1320–1323 ప్రాంతాలలో జరిగాయి. అందులో అల్లాఉద్దీన్ ఖిల్జీ కాలంలో అంటే 1310–1312 మధ్యకాలంలో దక్షిణ భారతదేశంపై జరిగిన దండయాత్రలలో సేనాధిపతి మాలిక్ కాఫర్ సైన్యం దక్షిణభారతం వైపు దండయాత్రకు వచ్చిన సమయంలో వారితో పాటు వచ్చిన చరిత్రకారుడు అమీర్ ఖుస్రో, ఆయన తన రచనల్లో తమ దండయాత్ర లక్ష్యం "తిలింగ్ అని, దాని రాజదాని "ఆరంగల్" కోట (ఆనాటి ఓరుగల్లు. నేటి వరంగల్) ఎంతో గొప్పగా ఉందని ప్రస్తావించాడు. ఆయన తన రచనల్లో ఆరంగల్ కోట వంటి కోటను తాను అంతకుముందు ఎక్కడా చూడలేదని కూడా ప్రశంసించాడు.అలాగే 1323లో కాకతీయ సామ్రాజ్యం పతనమైన తర్వాత ప్రతాపరుద్రుడిని బందీగా తీసుకెళ్లినపుడు అతని సైన్యాధ్యక్షుడు గన్నమ నాయుడు (అతనికి యుగంధరుడు అనే మరొక పేరు కూడా ఉంది) ఇస్లాం మతం పుచ్చుకుని తన పేరును 'మాలిక్' మక్బూల్గా మార్చుకున్నాడు అని తెలుస్తోంది. దీనికిగాను ఆనాటి ఢిల్లీ సుల్తానులు గన్నమ నాయుడు/ యుగంధరుడు/మాలిక్ మక్బూల్ కు ఒక బిరుదును ప్రదానం చేశారు. ఆ బిరుదు పేరు 'ఖాన్–ఏ తెలంగాణ! ఈ ప్రస్తావనను అనుసరించి తెలంగాణ పేరుకి చారిత్రకంగా ఒక నిర్దిష్ట ప్రామాణికత 13వ శతాబ్ది నాటికి వచ్చిందనే విషయం స్పష్టంగా తెలుస్తోంది.ఇక, శాసనపరమైన ఆధారాల విషయానికొస్తే, ప్రాంతంగా తెలంగాణ పద ప్రస్తావన మొదటిసారి పూర్వ మెదక్ జిల్లా రామచంద్రపురం మండలం తెల్లాపూర్ గ్రామంలో బయల్ప డింది. అక్కడ నిర్మించిన దిగుడుబావి ముందర ఒక శాసనం వెలుగు చూసింది. ఆ శాసనం తెల్లాపూర్ శాసనంగా పురావస్తు శాఖ వారు నిర్ధారించి, ఇది క్రీస్తుశకం 1417లో వేసినట్లుగా ధ్రువీకరణ చేసారు. భారతీయ కాలమానం ప్రకారం హేవిళంబి నామ సంవత్సరం మాఘ శుద్ధ దశమి నాడు వేసిన ఈ శాసనంలో స్తంబానికి ఒకవైపు మొత్తం ఇరవై నాలుగు పంక్తులలో ఉన్న వ్యాఖ్యానంలో ఒకచోట "తెలంగాణ" అనే పదం ఉండటం విశేషం! ఇలా ప్రస్తుత కాలపు పిలుపుతో సంపూర్ణంగా తెలంగాణ'ను ప్రస్తావించిన తొలి శాసనంగా తెల్లాపూర్ శాసనం ప్రత్యేకతని సంతరించుకుంది.అలాగే ఈ శాసన కాలానికి దాదాపు 30ఏళ్ల తర్వాత వేయబడిన మరొక శాసనం వెలిచెర్ల శాసనం. దీనిని క్రీస్తుశకం 1516లో ప్రతాపరుద్ర గణపతి వేయించారు. ఈ శాసనంలో తెలంగాణ అనే పదం ప్రయోగించబడినట్లుగా ఆధారాలున్నాయి.అలాగే క్రీస్తు శకం 1358వ సంవత్సరంలో వేసిన శ్రీరంగం తామ్ర శాసనంలో కూడా 'తెలింగ దేశ అనే పదాలతో తెలంగాణ ప్రాంత ప్రస్తావన ఉందని తెలుస్తోంది. ఇక శ్రీకృష్ణదేవరాయల కాలంలో కూడా తెలంగాణ ప్రాంత ప్రస్తావన ఉన్నట్లుగా పురావస్తు ఆధారాలు మనకు నిరూపిస్తున్నాయి. రాయలు వేసిన శాసనాలలో తిరుమల లోని 1517 శాసనంలో 'తెలంగాన్యపు దుర్గాలు" అనే మాట ప్రస్తావించబడింది.

ఇలా 'తెలంగాణ' పదం ప్రాచీనత సాహిత్య ఆధారాలను అనుసరించి పురాణాల కాలం నుంచి, శాసన ఆధారాలను అనుసరించి 13వ శతాబ్దం నుంచి అమలులో ఉన్నదని తేటతెల్లం అవుతున్నది. ఈ దిశగా మరింత పరిశోధన, పరిశీలన జరగాల్సిన అవసరం కూడా ఉన్నది. సీనియర్ జర్నలిస్ట్ వెంకటయోగి రఘురామ్.

# పరిశుభ్ర నగరాల్లో తిరుపతిని దేశంలో నెంబర్ వన్ గా నిలపాలి

## ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు , కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి (ప్రశ్న న్యూస్) ఒక రాష్ట్రం ఒక పరిశుభ్రత లక్ష్యంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ ను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. పరిశుభ్ర నగరాల్లో తిరుపతిని దేశంలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. 22వ డివిజన్ పరిధిలోని ఎల్ ఎస్ నగర్ స్టామ్మ్ వాటర్ డ్రెయిన్ ను ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, కార్పోరేషన్ కమిషనర్ శారదా దేవి, క్లీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పోరేషన్ ఛైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పోరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం,టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, బిజేపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, కాలనీవాసులు కలిసి శుభ్రపరిచారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటితో పాటు పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

స్టామ్ వాటర్ కాలువలు, ప్రధాన మురుగునీటి కాలువల్లో ప్రజలు వ్యర్థాలు వేయకుండా ఉండాలని ఆయన కోరారు. చెత్తను విడగొట్టి మున్సిపల్ సిబ్బందికి అందించి పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 20వ తేది వరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు స్వచ్ఛ సర్వేక్షణ్ లో రాష్ట్రంలోని ప్రధాన నగరాలన్నీ అవార్డులు సాధించేలా చర్యలు తీసుకున్నారని ఆయన చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని కార్పోరేషన్లు, మున్సిపాల్టీలు, పంచాయతీల్లో ఆపరేషన్ క్లీన్ స్వీప్ నిర్వహిస్తున్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఒక్కో వారం ఒక్కో థీమ్ తో ఆపరేషన్ క్లీన్ స్వీప్ జరుగుతున్నదని ఆయన చెప్పారు. తిరుపతిలో 25 కిలోమీటర్ల స్టామ్ వాటర్ డ్రెయిన్ లు, 65 కిలో మీటర్ల మేర ప్రధాన మురగునీటి కాలువలు ఉన్నాయని ఆయన చెప్పారు. కాలువల్లో చెత్త పేరుకుపోవడం వల్ల వర్షాకాలంలో నీరు నిలిచి డెంగ్యూ, మలేరియా, చికిన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయన తెలిపారు. పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి ఇచ్చి సహకరించాలని ఆయన సూచించారు. లెగసి డంప్ లు లేకుండా చేయగలిగామని ఆయన చెబుతూ మరోసారి లెగసీ డంపులకు అవకాశం ఇవ్వరాదని ఆయన కోరారు. స్వచ్ఛ సర్వేక్షన్ పోటీలో తిరుపతిని విజేతగా నిలిచేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. దేశంలో తిరుపతిని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ శ్యామ్ సుందర్, ఈఈలు తులసీ కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల ఇంటికో వెలుగు

**- గజ్వేల్‌లో లబ్దిదారులతో సంబరాలు**

**అర్హులందరికీ గృహాలే ప్రభుత్వ లక్ష్యం**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గూడు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి కౌన్సిలర్లు నక్క సంతోష్ రాములు గౌడ్, గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా ఆదివారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులను కలిసి మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గృహం లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ గృహ పథకం ద్వారా శాశ్వత నివాస సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఇప్పటికే సుమారు 60 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. రెండో విడతలో గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మరో 600 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఇంకా అర్హత కలిగిన కుటుంబాలు దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి అర్హులందరికీ గృహాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేదలకు సొంతింటి భరోసా కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఇందిరమ్మ గృహాల మంజూరుతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని, సొంతింటి కల నెరవేరుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ వహీద్ ఖాన్, పార్టీ సీనియర్ నాయకులు ఊడేం శ్రీనివాస్ రెడ్డి, గంగిశెట్టి రాజు, జహంగీర్, ఆంజనేయులు యాదవ్, శ్రావణ్, హసన్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల పార్టీ కాంగ్రెస్ పార్టీ

**ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్ల కు గృహప్రవేశం**




మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ డివిజన్ లో కొండలి హైమవితి ,మార్గాల నాగమణి,మార్గాల లలిత,గలవా ప్రసన్న 5 ఇండ్ల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డి.ఈ, ఏ.ఈ, చీఫ్ గెస్ట్ గా డిప్యూటీ కమిషనర్ సుధాంష్, డిప్యూటీ ఎమ్మార్వో, ఆర్ఐ, మున్సిపల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ చీర్ల రమేష్, మాజీ కౌన్సిలర్ మణికంఠ గౌడ్, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్ యాదవ్, గౌడవెల్లి సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, గౌడవెల్లి బాల్ రెడ్డి, ఆర్ఆర్ గౌడ్, బిపిటి రాజు, అగ్రికల్చర్ డైరెక్టర్ శంకర్, అగ్రికల్చర్ డైరెక్టర్ రేగురాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ కౌడేమహేష్ పూడూరు సత్తిరెడ్డి, బాల మల్లేష్, రఘుపతి రెడ్డి, చంద్రయ్య, వెంకటరామిరెడ్డి, భూపాల్ రెడ్డి, రంజిత్, రమేష్, టి యాదయ్య, శీను, బాబు, ఎన్ ఎస్ యు ఐ రాకేష్, మొన్నార్క్, శ్యామ్ ,రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇంద్ర ఇండ్ల లబ్బిదారులందరూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈనెల 2 నుండి రెండో విడత కార్యక్రమం జరుగుతుంది కావున లబ్ధిదారులు ఎవరైనా ఉంటే మున్సిపల్ ఆఫీస్ లో ఇందిరమ్మ కమిటీ సభ్యులకు మీ పేర్లను నమోదు చేయవలసిందిగా కోరారు

# రోడ్డు మరమ్మత్తుల కోసం పంచాయతీరాజ్ ఏఈ కి వినతి

**16వ వార్డు కౌన్సిలర్ సద్ది సురేష్ రెడ్డి,**

**21 వ వార్డు కౌన్సిలర్ చిన్నోళ్ల భాస్కర్**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని నూతనకల్ గ్రామం నుండి కానుకుంట గ్రామానికి కలిపే పంచాయతీరాజ్ రోడ్డు పూర్తిగా గుంతల మయంగా అయిందని కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్ ఆరోపించారు. ఈ రహదారికి చాలా సంవత్సరాల నుంచి మరమ్మత్తులు చేయించక ప్రయాణించడానికి అనుకూలంగా లేదని తెలిపారు. గుంతలు ఎక్కువ లోతు ఉండడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారని, రానున్నది వర్షాకాలం కావడంతో ఈ రహదారిపై ప్రయాణించడం ఇబ్బందికరంగా ఉంటుందని పేర్కొన్నారు. వాహనదారులకు, ఉద్యోగస్తులకు, కాలేజీలకు,పాఠశాలలకు వెళ్లే వారందరికీ చాలా ఇబ్బందికరంగా ఉందని అనేక వాహనాలకు ఆక్సిడెంట్ జరిగి ప్రమాదాలకు గురి కావడం జరుగుతుందని జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఏఈ చంద్రశేఖర్ కలిసి ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని 16వ వార్డ్ కౌన్సిలర్ సద్ది సురేష్ రెడ్డి, 21 వార్డు కౌన్సిలర్ చిన్నోళ్ల భాస్కర్ వినతి పత్రం అందజేశారు. దానికి సానుకూలంగా పంచాయతీరాజ్ శాఖ ఏఈ చంద్రశేఖర్ స్పందించి ఆమ్ ప్రాజెక్టు ద్వారా త్వరగా పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు.

# ప్రో కబడ్డీ లీగ్‌కు సిద్దిపేట క్రీడాకారుడు లారెన్ ఎంపిక

**- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సి. సంతోష్ హర్షం**

**- యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపు**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్‌కు చెందిన ప్రతిభావంతుడైన కబడ్డీ క్రీడాకారుడు లారెన్ ప్రతిష్టాత్మక ప్రో కబడ్డీ లీగ్‌కు ఎంపిక కావడం పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సి. సంతోష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిద్దిపేట జిల్లా నుంచి జాతీయ స్థాయి ప్రో కబడ్డీ లీగ్‌కు లారెన్ ఎంపిక కావడం జిల్లాలోని యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అందిస్తున్న ప్రోత్సాహం, నాణ్యమైన శిక్షణ, క్రీడాకారుల కృషి ఫలితంగానే లారెన్‌కు ఈ అరుదైన అవకాశం లభించిందన్నారు. క్రీడల్లో విజయాలు సాధించాలంటే కఠిన శ్రమ, అంకితభావం, క్రమశిక్షణ ఎంతో అవసరమని, యువత క్రీడలను కెరీర్‌గా ఎంచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రస్తుతం లారెన్ కేరళలో జరుగుతున్న కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాడని, పోటీలు ముగిసిన అనంతరం తెలంగాణకు తిరిగి రానున్నట్లు తెలిపారు. ప్రో కబడ్డీ లీగ్‌లో అడుగుపెడుతున్న లారెన్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే జిల్లాలో కబడ్డీ అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శివకుమార్‌తో పాటు జిల్లా కమిటీ సభ్యులందరికీ ఎన్.సి. సంతోష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయంతో సిద్దిపేట జిల్లా కబడ్డీ రంగంలో మరో మైలురాయిని చేరుకుందని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# నూతన మున్సిపల్ కమిషనర్‌కు ఘన స్వాగతం

**మర్యాదపూర్వకంగా కలిసిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన గణేష్ రెడ్డిని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్ కార్ పద్మాబాయి నర్సింగ్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్ కార్యాలయంలో ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించడంతో పాటు పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ పట్టణ సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి పాలకవర్గం మరియు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. నూతన కమిషనర్ నాయకత్వంలో మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం కావడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సొంతింటి కల నెరవేర్చిన ఎమ్మెల్యే సత్యం - లబ్ధిదారుల హర్షం

**- ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన సర్పంచ్ కనుకయ్య**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామానికి చెందిన సుంకపాక లక్ష్మి-రాజయ్య కుటుంబం ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా నిర్మించుకున్న నూతన గృహంలో గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ-రాజు, కాంగ్రెస్ నాయకులు ఏనుగుల ప్రశాంత్ కుమార్, మార్కెట్ డైరెక్టర్ కళ్లేపెల్లి సతీష్, సాగరం కనకయ్య, వార్డ్ సభ్యులు దమ్మ వెంకట రమణ, జోగు శంకర్, దయ్యాల రేణుక, పైండ్ల అనిల్, సుంకపాక హేమలత అనిల్ రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం కృషితో తమ సొంత ఇంటి కల నెరవేరిందని కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జనగం శేఖర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బీజేపీకి గజ్వేల్ నేత కమ్మారి శ్రీనివాస్ రాజీనామా

**- జనసేన పార్టీలో చేరిక**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ భారతీయ జనతా పార్టీ నాయకుడు కమ్మారి శ్రీనివాస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి సోమవారం రోజున రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు పంపించారు. వ్యక్తిగత కారణాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలోనే తాను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి వైదొలుగుతున్నట్లు శ్రీనివాస్ తన లేఖలో స్పష్టం చేశారు. పార్టీ పట్ల తనకు ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందని, అయితే అనివార్యమైన వ్యక్తిగత పరిస్థితుల వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావుకు అత్యంత ఆప్తుడిగా, నమ్మినబంటుగా కమ్మారి శ్రీనివాస్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఎనలేని సేవలు అందించారు. గజ్వేల్ నియోజకవర్గంలో కీలక నేతగా ఉన్న శ్రీనివాస్ అకస్మాత్తుగా రాజీనామా చేయడం స్థానిక బీజేపీ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నప్పటికీ... రేపు (మంగళవారం) జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో తాను జనసేన పార్టీలో చేరుతున్నట్లు కమ్మారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో అధికారికంగా వెల్లడించారు.

# తాపీ మేస్త్రీల ఆత్మగౌరవ సభ ను విజయవంతం చేయాలి



నాచారం(ప్రశ్న న్యూస్) నిర్మాణ రంగంలో కీలకమైన తాపీ మేస్త్రీల హక్కులు, జీవనోపాధి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు నిర్వహించే 'తాపీ మేస్త్రి ఆత్మగౌరవ సభను' విజయవంతం చేయడం ప్రతి కార్మికుడి బాధ్యత అని, తాపీ మేస్త్రీల ఐక్యతను చాటిచెప్పే ఈ సభను విజయవంతం చేయాలని తాపీ మేస్త్రి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షుడు ఐలన్న పిలుపునిచ్చారు. నాచారం భవన నిర్మాణ కార్మికుల ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐలన్న మాట్లాడుతూ తాపీ మేస్త్రీలను కించపరిచే విధంగా మాట్లాడిన సెంట్రింగ్ కార్మిక నాయకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాపీ మేస్త్రీలను అణగదొక్కాలని చూస్తున్నారని ఇది ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. జూన్ 8న సోమవారం ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే తాపీ మేస్త్రీల ఆత్మగౌరవసభకు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు అన్నారు. గృహ నిర్మాణం లో కేవలం సెంట్రింగ్ నిర్మించి స్లాబ్ వేసే పని చేసే వరకు మాత్రమే సెంట్రింగ్ కార్మికుకు ఉంటారని, కానీ ఇల్లు పూర్తి కావడానికి తాపీ మేస్త్రి ఎంతో ముఖ్యమన్నారు. పది రంగాల కార్మికులకు తాపీ మేస్త్రీలు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. తాపీ మేస్త్రీలను హఠావో, సెంట్రింగ్ కార్మికులను బచావో' అలాగే 'తాపీ మేస్త్రీలు దళారులు' అంటూ కొందరు సెంట్రింగ్ కాంట్రాక్టర్లు నినాదాలు చేస్తూ సమ్మెలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సెంట్రింగ్ కాంట్రాక్టరులు వారి రేట్ పెంచుకోవడం కోసం, ప్రభుత్వ నుండి వచ్చే సంక్షేమ పథకాల కోసం సమ్మె ఎవరికీ ఇబ్బంది లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సుర వెంకటయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు సుకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు తన్నీరు శ్రీనివాసరావు, నాచారం అధ్యక్షులు టి కృష్ణ, గౌరవ అధ్యక్షులు పి సుబ్బారావు, ఉపాధ్యక్షులు కుంచాల శ్రీను, డి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ప్రభాకర్, కార్యదర్శి మహేందర్, డి మాధవ, ఎం శీను, బి నారాయణ, టీ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# చందా న్యూరో హాస్పిటల్ పై విచారణ జరిపించాలి

**- అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి**

**- తెలంగాణ అంబేద్కర్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్**

**- చంటి శ్రీనివాస్ డిమాండ్**

**- పార్కింగ్ నిబంధనలపై ఫిర్యాదు**




కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ పట్టణంలో మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మించబడుతున్న భవనాలు, ఆస్పత్రులపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోర్టు సమీపంలో ఉన్న చందా న్యూరో అండ్ ట్రామాకేర్ హాస్పిటల్ భవనం సుమారు 45 సంవత్సరాల క్రితం నిర్మించబడిందని, ఇటీవల ఆ భవనాన్ని రీ-మోడలింగ్ చేసి ఆధునిక అద్దాల భవనంగా మార్చారని తెలిపారు. భవనం నిర్మాణ భద్రతపై అనుమానాలు ఉన్నాయని, దీనికి సంబంధించి మున్సిపల్ అనుమతులు పొందారా లేదా అన్న అంశంపై అధికారులు విచారణ చేపట్టాలని కోరారు. హాస్పిటల్‌లో పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని, దీంతో రోగులు, వారి బంధువుల వాహనాలు రోడ్డుపైనే నిలిపివేయాల్సి వస్తోందని ఆరోపించారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో 2025 ఆగస్టు 23న ఈ విషయంపై ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అధికారుల నుంచి షోకాజ్ నోటీసులు జారీ అయినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. పార్కింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఆస్పత్రి కార్యకలాపాలు నిర్వహిస్తున్న యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే భవనాన్ని తనిఖీ చేసి, నిర్మాణ అనుమతులు, భద్రతా ప్రమాణాలు, పార్కింగ్ సౌకర్యాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని కోరారు. నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే సంబంధిత యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని చంటి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# మాజీ మంత్రి గోడిశెల రాజేశం గౌడ్‌ను పరామర్శించిన జి.ఆర్. దేశాయి



జగిత్యాల (ప్రశ్న న్యూస్)ఇటీవల మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న మాజీ మంత్రి గోడిశెల రాజేశం గౌడ్‌ను జగిత్యాల పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ జి.ఆర్. దేశాయి సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేశం గౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న దేశాయి, శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆయన త్వరగా కోలుకొని గతంలో మాదిరిగానే ప్రజా జీవితంలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షించారు. రాజేశం గౌడ్‌తో కొంతసేపు ఆత్మీయంగా మాట్లాడిన దేశాయి, వైద్యుల సూచనలను పాటిస్తూ పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా రాజేశం గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. తనను ప్రత్యేకంగా కలిసి పరామర్శించిన జి.ఆర్. దేశాయికి మాజీ మంత్రి రాజేశం గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆత్మీయ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.

గ్రామ దేవతల ఆశీస్సులతో నీలోజిపల్లిలో

# ఘనంగా బొడ్రాయి ఉత్సవం

- బోనాల వేడుకకు సిద్ధమైన నీలోజిపల్లి గ్రామం
- గ్రామ సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు
- గ్రామంలో నెలకొన్న ఆధ్యాత్మిక సందడి
- తెలుగు సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం
- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న బొడ్రాయి కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయని గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ తెలిపారు. గ్రామ సంక్షేమం, ప్రజల సుఖశాంతులు, పంటల సమృద్ధి కోసం గ్రామ ప్రజలందరి సహకారంతో సంప్రదాయబద్ధంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ఆరాధ్య దేవతలైన శ్రీ పోచమ్మ తల్లి, శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, శ్రీ దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో ఆదివారం సాయంత్రం ప్రారంభమైన బొడ్రాయి పండుగ కార్యక్రమాలు సోమవారం ఉదయం వరకు వైభవంగా కొనసాగాయని తెలిపారు. బొడ్రాయి వద్ద అల్లనేరేడు, మామిడి ఆకులతో ప్రత్యేక పందిరి ఏర్పాటు చేసి సంప్రదాయ పూజలు నిర్వహించినట్లు చెప్పారు.ప్రతి ఇంటి నుంచి భక్తులు ఒక బిందె నీరు, ఒక కొబ్బరికాయ తీసుకువచ్చి బొడ్రాయికి జలాభిషేకం నిర్వహించారని, మహిళలు మంగళహారతులతో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారని తెలిపారు. బియ్యంతో బొడ్రాయి అమ్మవారి రూపాన్ని తీర్చిదిద్దడం, రాతిబోనం పండించడం, గొర్రెపిల్లను గావు పట్టడం, పొలిమేర తిరగడం, బలి తదితర సంప్రదాయ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు వెల్లడించారు.అనంతరం జూన్ 3వ తేదీ బుధవారం గ్రామ దేవతలైన శ్రీ పోచమ్మ తల్లి, శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, శ్రీ దుర్గమ్మ తల్లి వారి బోనాల మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవాలకు గ్రామ ప్రజలందరూ కుటుంబ సమేతంగా హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సర్పంచ్ అనుముల భాస్కర్ కోరారు.గ్రామ సంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షించుకుంటూ ఐక్యతతో పండుగలను నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. బొడ్రాయి పండుగ, బోనాల మహోత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పడంతో పాటు గ్రామ ప్రజల మధ్య సౌభ్రాతృత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఆయన అన్నారు.

# నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

- నర్సింగాపూర్ సర్పంచ్ : మామిడిశెట్టి సరిత - మునిందర్
- ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ సరిత



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు సోమవారం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు గంగిపల్లి మీనా – సంపత్ దంపతులు నిర్మించిన నూతన గృహంలో గృహప్రవేశ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ మామిడిశెట్టి సరిత – మునిందర్ హాజరై రిబ్బన్ కత్తిరించి నూతన గృహాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరిత మాట్లాడుతూ,నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రధాన లక్ష్యమని అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవతో గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతున్నాయని తెలిపారు. గంగిపల్లి మీనా -- సంపత్ దంపతులు నూతన గృహంలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలోని ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎదులాపురం ఆకేష్, వార్డు సభ్యులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్, లాల్ కనుకయ్య, రెడ్డవేణి గీతారాణి,సావనపల్లి అశోక్,గ్రామ పంచాయతీ కార్యదర్శి రాం, గ్రామ పెద్దలు,తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న కొట్టెపల్లి సుధాకర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంతో పాటు గుండన్నపల్లి, తడగొండ గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యంతో కలిసి బోయినిపల్లి సెస్ డైరెక్టర్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు కొట్టెపల్లి సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసిన వారు, పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నివాస సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

# ఇందిరమ్మ ఇల్లు పథకంతో పేదల సొంతింటి కల సాకారం

- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
-జిల్లా కలెక్టర్ : గరిమ అగ్రవాల్
- మండలంలోని మూడు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బోయినిపల్లి,గుండన్నపల్లి, తడగొండ గ్రామాల్లో నిర్మాణం పూర్తిచేసుకున్న ఇందిరమ్మ గృహాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు నూతన గృహాలను అందజేశారు. గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రజలు, లబ్ధిదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అతిథులు గృహాల వద్ద రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడంతో పాటు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గృహాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకం గురించి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న ప్రతి అర్హ కుటుంబానికి గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ లబ్ధిదారులు నాణ్యతా ప్రమాణాలతో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.కార్యక్రమం సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ వేడుకల్లో ఎంపీడీఓ, ఏఈలు, డీఈలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. నూతన గృహాలు అందుకోవడంతో తమ జీవితకాల స్వప్నం నెరవేరిందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజలు, ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రతి నెల ఒకటో తేదీనే పంపిణీ సొంత ఊరులోనే ఎమ్మెల్యే బొజ్జల పింఛన్ కార్యక్రమం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తన సొంత గ్రామంలోకి అడుగుపెట్టడం,వృద్ధులు, అవ్వాతాతలు ఆయనకు నవ్వుతూ స్వాగతం పలకడం, ఆయన స్వయంగా పింఛన్ డబ్బులు చేతికి అందిస్తూ, వారి భుజంపై చేయి వేసి ఆప్యాయంగా మాట్లాడటం.సొంత ఊరు కన్నతల్లి లాంటిది. పదవులు ఎన్ని ఉన్నా, పుట్టిన గడ్డపై చూపించే మమకారమే వేరు. ఈనెల ఒకటో తేదీన తన సొంత గ్రామంలో పర్యటించారు స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ప్రభుత్వం ప్రతి నెల 1వ తేదీ ఉదయం నుంచే అత్యంత ప్రతిష్టాత్మకంగా పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తుంది వృద్ధులు, వికలాంగులు వితంతువులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇబ్బంది పడకుండా సచివాలయ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి బయోమెట్రిక్ ఐరిస్ విధానం ద్వారా నగదును చేతికి అందిస్తారు. అందుకే ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నట్టు ప్రతి నెల ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్లలో పండగ వాతావరణం కనిపిస్తుంది.గ్రామంలోని అవ్వాతాతలు, అక్కాచెల్లెమ్మలకు స్వయంగా పింఛన్లను పంపిణీ చేసిన సుధీర్ రెడ్డి కేవలం పథకాన్ని అందించడమే కాకుండా ప్రతి ఒక్కరి దగ్గరకు వెళ్లి కూర్చున్నారు. వారి సుఖ సంతోషాలను,ఇళ్లల్లో ఉన్న సాధకబాధకాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు.మీకు నేనున్నాను అంటూ భరోసా ఇచ్చారు.తమ ఊరి బిడ్డ, తమ కష్టసుఖాలు తెలిసిన నాయకుడు ఇలా తమ మధ్యకు వచ్చి క్షేమసమాచారాలు కనుక్కోవడంతో గ్రామస్తుల ఆనందానికి అవధులు లేవు.సొంత గడ్డపై సుధీర్ రెడ్డి చూపించిన ఈ ప్రేమాభిమానాలు ఇప్పుడు అందరి మనసులను గెలుచుకుంటున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్తులతో సుధీర్ రెడ్డి ఎంతో ఆప్యాయంగా గడిపారు.వృద్ధులు, దివ్యాంగుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితులు, పిల్లల చదువుల గురించి ఆరా తీశారు.గ్రామంలో ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి, వాటిని వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.తమ సొంత ఊరి బిడ్డ ఇంతటి ఉన్నత స్థానంలో ఉండి కూడా, ఏమాత్రం గర్వం లేకుండా తమ సుఖ సంతోషాలను నిలుస్తున్న సుధీర్ రెడ్డి కి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు మరియు దీవెనలు అందజేశారు.నా సొంత ఊరి ప్రజలారా నా పెద్దలారా అందరికీ నా నమస్కారాలు.ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు ఒకటో తేదీ రాగానే మీ అందరికీ పింఛన్లు అందించే భాగ్యం నాకు కలగడం నా పూర్వజన్మ సుకృతం. ఈ ఊరు నన్ను పెంచింది, మీ దీవెనలు నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయి. మీ చేతిలో పింఛన్ డబ్బులు పెట్టినప్పుడు మీ ముఖాల్లో కనిపించే ఆనందమే నాకు కొండంత బలం.పెంచింది, మీ దీవెనలు నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయి. మీ చేతిలో పింఛన్ డబ్బులు పెట్టినప్పుడు మీ ముఖాల్లో కనిపించే ఆనందమే నాకు కొండంత బలం.నేను కేవలం పింఛన్ ఇవ్వడానికి రాలేదు నా ఊరి జనం ఎలా ఉన్నారు, మీ ఇళ్లల్లో సుఖ సంతోషాలు ఎలా ఉన్నాయని కనుక్కోవడానికి వచ్చాను. మీ ఇంట్లో ఏ కష్టం వచ్చినా, ఏ అవసరం ఉన్నా మీ బిడ్డగా నేను ఎప్పుడూ ముందుంటాను. మీ ఆరోగ్యం జాగ్రత్త, మీ పిల్లలను బాగా చదివించండి. మీ అందరి చల్లని దీవెనలు ఎల్లప్పుడూ నాపై ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను.

# మైసిరెడ్డిపల్లిలో భూవివాదం

- కారంపొడి చల్లి, కర్రలతో దారుణ దాడి
- పాతకక్షలతో రెచ్చిపోయిన దాయాదులు
- మహిళలపై సైతం దాడి, వీడియో వైరల్
- నలుగురిపై కేసు నమోదు చేసిన మేడ్చల్ పోలీసులు



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) భూవివాదం, పాతకక్షల నేపథ్యంలో దాయాదులు దేవదానం మరియు మంజుల మాజీ సర్పంచ్ కరుణాకర్ ప్రదీప్ ఆ నలుగురు కలిసి జార్జ్, సంతోషి, మధుకర్ ల పైన కారంపొడి చల్లుకుంటూ, కర్రలతో దారుణంగా దాడి చేశారు ఘోర కలియుగ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మైసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మల్లిగారి సంతోషకు సర్వే నంబర్ 114లో ఒక ఎకరం మూడు గుంటల వ్యవసాయ భూమి ఉంది. వర్షాకాలం ప్రారంభమవుతుండటంతో పొలాన్ని చదును చేసుకునేందుకు గత నెల 29 వ తేదీ సాయంత్రం 4:30 గంటల ప్రాంతంలో సంతోష, ఆమె భర్త జార్జ్, కుమారుడు మధుకర్‌తో కలిసి వెళ్లారు.

### కళ్లల్లో కారం కొట్టి.. కిందపడేసి..:

సంతోష, ఆమె భర్త జార్జ్, కుమారుడు మధుకర్ లు పొలంలో పనులు చేసుకుంటుండగా గ్రామానికి చెందిన దేవదానం, అతని భార్య మంజుల, కుమారులు కర్ణాకర్ (గ్రామ మాజీ సర్పంచ్) ప్రదీప్‌లు అక్కడికి చేరుకున్నారు. ఎందుకు వచ్చారని ప్రశ్నించే లోపే, ముందస్తు ప్రణాళికతో తెచ్చుకున్న కారంపొడిని బాధితుల కళ్లల్లో చల్లారు. కళ్లు కనబడక ఇబ్బంది పడుతున్న సంతోష కుటుంబ సభ్యులపై కర్రలతో ఇష్టమొచ్చినట్లు విరుచుకుపడ్డారు. అంతటితో ఆగకుండా బూతులు తిడుతూ, మహిళలను సైతం జుట్టు పట్టుకుని కిందపడేసి విచక్షణారహితంగా తన్నారు. గత కొంతకాలంగా సాగుతున్న భూవివాదాన్ని మనసులో పెట్టుకునే ఈ దాడికి పాల్పడినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

### సోషల్ మీడియాలో వీడియో వైరల్ :

ఈ ఘర్షణకు సంబంధించిన దృశ్యాలను అక్కడున్న వారు మొబైల్‌లో చిత్రీకరించగా, సదరు వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మహిళ జుట్టు పట్టుకుని పొలంలో ఈడ్చుకుంటూ కొట్టడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులని గవర్నమెంట్ ఆసుపత్రికి ట్రీట్మెంట్ అనంతరం పంపించారు.

### కేసు నమోదు.. దర్యాప్తు :

బాధిత మహిళ సంతోష ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల ప్రకారం పోలీసులు అండర్ సెక్షన్ 118(1), 3(5) (భారతీయ న్యాయ సంహిత) కింద నిందితులపై సబ్-ఇన్‌స్పెక్టర్ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఘనంగా 'ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక'

- అటవీ సంరక్షణే ధ్యేయం, ప్లాస్టిక్ రహిత పార్కులే లక్ష్యం
- నారేపల్లి భాగ్యనగర్ నందనవనంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమం ప్రారంభం




మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుండి జూన్ 12, 2026 వరకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అటవీ సంరక్షణ, వన్యప్రాణి పరిరక్షణ అవగాహన మరియు విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

### మొదటి రోజు 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్' నిర్మూలన :

కార్యక్రమాల ప్రారంభోత్సవంలో భాగంగా సోమవారం జిల్లాలోని అన్ని అర్బన్ ఫారెస్ట్ పార్కులలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణం మరియు వన్యప్రాణులపై ప్లాస్టిక్ వల్ల కలిగే హానికరమైన ప్రభావాలపై సందర్శకులకు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. పార్కులను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. నారేపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లోని భాగ్యనగర్ నందనవనం పార్క్ వద్ద నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి ఎం. వేణు మాధవ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

### ప్రజల సహకారం ఎంతో అవసరం -- జిల్లా అటవీ అధికారి :

ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి ఎం. వేణు మాధవ రావు మాట్లాడుతూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో 43 అటవీ బ్లాకులలో విస్తరించి ఉన్న 8,360 హెక్టార్ల అటవీ విస్తీర్ణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత. అర్బన్ ఫారెస్ట్ పార్కులను ప్లాస్టిక్ రహితంగా ఉంచడంలో ప్రజల సహకారం ఎంతో అవసరం. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సహజ వనరుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే ఈ ప్రణాళిక యొక్క ప్రధాన ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు.

### జూన్ 12 వరకు ముమ్మరంగా కార్యక్రమాలు :

జూన్ 12 వరకు కొనసాగే ఈ 'ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు, అడవుల పరిశుభ్రత కార్యక్రమాలు, పాఠశాలలు, గ్రామాల్లో అవగాహన సదస్సులు, వన్యప్రాణుల రక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించే వినూత్న కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పర్యావరణం మరియు వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చురుకుగా ముందుకు వచ్చి, ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అటవీ శాఖ అధికారులు పిలుపునిచ్చారు.


# బీజేవైఎం రాష్ట్ర పదాధికారిగా విక్రమ్ సింగ్ నియమకం

**యువత, విద్యార్థుల సమస్యలపై బీజేవైఎం న్యాయపోరాటం: విక్రమ్ ఠాకూర్**



కీసర (ప్రశ్న న్యూస్) భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర నూతన పదాధికారుల జాబితాలో మేడ్చల్ రూరల్ జిల్లా, కీసర మండలం బండ్లగూడ గ్రామానికి చెందిన బీజేవైఎం జిల్లా నాయకుడు, న్యాయవాది విక్రమ్ సింగ్ ఠాకూర్‌కు కీలక పదవి దక్కింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు సూచనల మేరకు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుందే ఆధ్వర్యంలో ఆయనను రాష్ట్ర పాలసీ రీసెర్చ్ కో-కన్వీనర్‌గా నియమించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నేతలకు విక్రమ్ ఠాకూర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగం, విద్యా రంగ సమస్యలు, డ్రగ్స్, గంజాయి వంటి మహమ్మారుల వల్ల యువత ఎదుర్కొంటున్న మానసిక ఆరోగ్య సవాళ్లపై బీజేవైఎం తరపున ఉధృతంగా పోరాడుతామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఫీజు రియంబర్స్మెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయాల్లో యువతను, విద్యార్థులను మోసం చేశాయని మండిపడ్డారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాలపై రానున్న రోజుల్లో న్యాయపోరాటం చేస్తామని విక్రమ్ ఠాకూర్ హెచ్చరించారు.

## ఆర్ టి ఐ 2005 సమాచార చట్టం తుంగలో తొక్కిన ముషీరాబాద్ డిప్యూటీ డిఇఓ లక్ష్మణ్ సింగ్


GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF SCHOOL EDUCATION

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)ఆర్టీఐ చట్టం ప్రకారం సమాచారం ఇవ్వలేమన్న డిప్యూటీ . ప్రశ్నలు లేవనెత్తుతున్న విద్యాశాఖ వ్యవహారం.ఆర్టీఐ 2005 చట్టం కింద ఓ సామాజిక వేత్త ఒక పాఠశాలకు సంబంధించిన వివరాలు కోరగా, సంబంధిత పాఠశాలపై పూర్తి సమాచారం ఇవ్వలేమంటూ డిప్యూటీ డీఈఓ కార్యాలయం నుండి సమాధానం రాతపూర్వకంగా రావడం చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు సమాచార హక్కు కల్పించేందుకు తీసుకొచ్చిన ఆర్టీఐ 2005 చట్టం ప్రకారం ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు తమ వద్ద ఉన్న సమాచారాన్ని చట్టబద్ధంగా అందించాల్సి ఉంటుంది. అయితే పాఠశాలకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించలేమని ఇచ్చిన సమాధానంపై పారదర్శకత, జవాబుదారీతనం అంశాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం నిరాకరించాలంటే ఆర్టీఐ చట్టంలోని నిర్దిష్ట మినహాయింపు నిబంధనలను స్పష్టంగా పేర్కొనాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కానీ సదరు ముషీరాబాద్ డిప్యూటీ డీఈవో లక్ష్మణ్ సింగ్ రాతపూర్వంకంగా నోటు పత్రంలో తమ సమాచారం వెల్లడించలేమని ప్రింట్ తీసి కాపీలు ఇవ్వడం ప్రశ్నార్థకంగా మారిందివిద్యాసంస్థల పరిపాలన, విధులు, అధికారుల బాధ్యతలు, నిర్వహణకు సంబంధించిన అనేక వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆర్టీఐ2005 చట్టంలోని సెక్షన్--4 పేర్కొంటోంది. పాఠశాలకు సంబంధించిన సమాచారం ఎందుకు ఇవ్వలేమన్న విషయంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి, ఆర్టీఐ నిబంధనలకు అనుగుణంగా చట్టాన్ని బే ఖాతాలు చేసిన సదరు డిప్యూటీ డిఇఓ లక్ష్మణ్ సింగ్ పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నరసరావుపేటలో కృష్ణ 83వ జయంతి వేడుకలు

- సూపర్ స్టార్ కృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేద్దాం
- కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు ఎండి ఫారూఖ్ వెల్లడి



**నరసరావుపేట** నరసరావుపేట పట్టణంలోని చిలకలూరిపేట రోడ్డులో గల అమ్మనాన్నల ప్రేమాలయం వృద్ధులఆశ్రమంలో పల్నాడు జిల్లా ఠ టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు ఎండి. ఫారూఖ్ బాబు ఆధ్వర్యంలో సూపర్ స్టార్ కృష్ణ 83వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయకుమార్ పాల్గొని ముందుగా కేక్ కట్ చేసి అక్కడి వృద్దులకు మరియు అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.నరసరావుపేట పట్టణ అధ్యక్షులు ఫారూఖ్ బాబు మాట్లాడుతూ, మా హీరో కృష్ణ స్వర్గస్తులై సుమారు 4 సంవత్సరాలు కావస్తున్నా నేటికి ఆయన మీద అభిమానం మాత్రం మా మనస్సులో చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. అలాగే ఆయన జ్ఞాపకనీ గా నరసరావుపేట పట్టణంలో కూడ ఒక విగ్రహాన్ని వీలయినంత తొందరగానే ఏర్పాటు చేయాలను కుంటున్నట్లు తెలియజేశారు. నరసరావుపేట పట్టణంలో కూడా కృష్ణ సీనియర్ అభిమానులు ఆర్థికంగా స్థిరపడిన వారు చాలామంది ఉన్నారని, కనీసం కొందరు సహకరించిన మనం సూపర్ స్టార్ కృష్ణ విగ్రహాన్నీ ఏర్పాటు చేసుకోవటం పెద్ద పనేమీ కాదన్నారు. ఈ కార్యక్రమంలో సినీయర్ అభిమానులు పత్తికొండ వెంకటరావు, బి.కొండలరావు, పద్మాలయవేణు, లింగంగుంట్ల రాములు, షేక్.నబీబాజీ, ఎన్.గోపికృష్ణ, ఫోటోగ్రాఫర్ చిన్నికృష్ణ , మన్నేపల్లిశ్రీనివాసరావు, ఎన్.జయకృష్ణ, షేక్.మీరావలి, దప్పుచంద్ర శేఖర్, కుక్కల పౌలు, సాగర్ కె.రమేష్ , ప్రిన్స్ బాషా, బాలస్వామి మరియు ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## కోటపాడులో పెన్షన్లను పంపిణీ చేసిన టిడిపి నాయకుడు మూల శివరామిరెడ్డి...

**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండలంలోని కోటపాడు గ్రామంలో ఇవాళ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి సీనియర్ నాయకుడు మూల శివరామిరెడ్డి నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అవ్వ తాతలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1000 రూపాయలు నుండి 4000 రూపాయల వరకు పెన్షన్లను పెంచిన ఘనత ఒక్క ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కే దక్కిందని కూటమి ప్రభుత్వంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు ప్రతి నెల ఒకటో తారీకు నే ఇస్తున్నందువల్ల అవ్వ తాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వెంకట మోహన్ సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఈఎచ్ఎస్ విధివిధానాలు ఖరారు చేయకుండానే వేతనాల్లో కోతలు విడ్డూరం

- ఆలులేదు, చూలులేదు కొడుకు పేరు సోమలింగం అనే చందంగా సర్కారు తీరు
- అనుమతి లేకుండ ఇహెచ్ఎస్ కటింగ్ ఎలా చేస్తారు?
- సిఎం, డిప్యూటీ సిఎం జోక్యం చేసుకొని కోతలను రద్దు
- గుట్టు చప్పుడు లేకుండా ఉద్యోగుల జీతాల్లో కోతలు
- ప్రభుత్వ నిరంకుశ పాలనపై పోరాటాలకు సిద్ధం.
- పీఆర్సీ, ఐదు డి ఏలు, పెండింగ్ బిల్లులపై లేని తొందర ఈఎచ్ఎస్ కోతలపై ఎందుకు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ ఉద్యోగుల నగదు రహిత వైద్య సేవల నిర్వహణలో భాగంగా ప్రవేశ పెట్టనున్న ఉద్యోగుల ఆరోగ్య పథకం విశయం లో ప్రభుత్వం మరో సారి ఉద్యోగులు నయవంచన గురిచేసింది. ఆరోగ్య పథకానికి సంబంధించిన విధి విధానాలు ఖరారు చేయకుండ, ఉద్యోగుల సమ్మతి లేకుండా గుట్టు చప్పుడు లేకుండా మే నెల వేతనంలో మూలవేతనం (బేసిక్ పే) పై 1.5 శాతం డబ్బును ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ఫండ్ పేరుతో కోత విధించడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో హామీలు, ఎన్నో ఆశలు, ఎన్నో డిమాండ్లు, ఎన్నో సమస్యల పరిష్కారానికి హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయ విశ్రాంత ఉద్యోగుల హక్కులను కాలరాస్తుందదంతో ఆందోళనలు తీవ్రమయ్యాయి. భారత రాజ్యాంగ ఆదేశిక సూత్రాల ప్రకారం భారత పౌరులందరికీ నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించే బాధ్యత ప్రభుత్వాలది,కానీ దానికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల నుండి 1.5 శాతం వేతనాన్ని మినహాయించుకుని వైద్య ఆరోగ్య సేవలు అందిస్తామనడం విడ్డూరంగా ఉందని విమర్శిస్తున్నారు. హాస్పిటల్స్ తో ఒప్పందం, ప్యాకేజీ రేట్లు నిర్ణయించకుండానే, ఈహెచ్ఎస్ ఫండ్ పేరుతో వేతనం నుండి 1.5 శాతం మినహాయింపు పై ఎలాంటి ఆదేశాలు ఇవ్వకుండానే ఆర్థిక శాఖ అత్యుత్సాహంతో ఈహెచ్ఎస్ ఫండ్ పేరిట ఉద్యోగుల మే నెల వేతనాల్లో 1.5 శాతం కోత విధించడం విడ్డూరమని అన్నారు. ఎంప్లాయ్ హెల్త్ స్కీం పై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఉన్న సందేహాలను నివృత్తి చేయకుండ రాష్ట్ర ప్రభుత్వం గుట్టు చప్పుడుగా మే నెల వేతనంలో కోత పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది.

గత నిబంధనల ప్రకారం భార్యా భర్తలు ఇద్దరు ఉద్యోగులు అయితే ఒక్కరు మాత్రమే ఫండ్ చెల్లించాలని స్పష్టంగా ఉన్నా ఇప్పుడు ఇద్దరి నుండి ఈఎస్ఎల్ ఫండ్ మినహాయించడం అత్యంత దుర్మార్గం అని ఇది ప్రభుత్వానికి తగదన్నారు, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగుల మినహాయింపులు ఎటు దారి మల్లుతున్నాయో అర్థంకాక ఆవేదన చెందుతున్నారని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 2023 జూలై నుండి రావలసిన పీఆర్సీని ఇవ్వకుండా, పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా, ఐదు డి ఏ లు ఇవ్వకుండా ప్రభుత్వం కల్లిబొల్లి మాటలతో కాలయాపన చేస్తు మోసం చేస్తుందని మండిపడ్డారు.

ఇది ప్రభుత్వానికి మంచిది కాదని హెచ్చరించారు.ఆర్థిక శాఖ అత్యుత్సాహంగా తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆబాసుపాలవుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి వెంటనే జోక్యం చేసుకొని అక్రమ చేసిన ఈహెచ్ఎస్ కోతలపై పునరాలోచన లేనియెడల ప్రభుత్వం నిరంకుశ పాలనపై ప్రత్యక్ష పోరాటాలు చేయవలసి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

# ఎగ్జిబిషన్‌లో అదృష్టవంతుడికి అయోధ్య దర్శనం

- లక్కీడ్రాలో గెలిచి నలుగురు కుటుంబ సభ్యులతో ఉచిత విమాన ప్రయాణం
- కె ఎస్ హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్ ఫర్ ఎగ్జిబిషన్ నిర్వాహకుడు కార్తీక్ శ్రీనివాస్ వెల్లడి
- జూన్ ఒకటవ తారీకు బల్కంపేట వాస్తవ్యుడు నాగేందర్ లక్కీడ్రా లో గెలుపు





హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ఎగ్జిబిషన్‌కు వచ్చిన సందర్శకులకు వినూత్నంగా ఆధ్యాత్మిక యాత్రను బహుమతిగా అందిస్తూ కేఎస్ హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్ ఫన్ ఫెయిర్ నిర్వాహకులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హైదరాబాద్‌లోని జేఎన్టీయూ నెక్సస్ మాల్ వెనుక నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌లో ప్రతి సోమవారం నిర్వహించే లక్కీ డ్రా ద్వారా విజేతలకు అయోధ్య దర్శనం కల్పించే కార్యక్రమం సందర్శకుల ప్రశంసలు అందుకుంటోంది.ఎగ్జిబిషన్ నిర్వాహకుడు కార్తీక్ శ్రీనివాస్ మాట్లాడుతూ అయోధ్యలోని శ్రీరామ మందిరాన్ని తలపించేలా ప్రత్యేక సెట్‌ను ఏర్పాటు చేసి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఎగ్జిబిషన్ టికెట్ కొనుగోలు చేసి సందర్శించిన వారిలో ప్రతి వారం ఒక అదృష్టవంతుడిని ఎంపిక చేసి, అతని కుటుంబంలోని నలుగురు సభ్యులకు అయోధ్య వెళ్లి రావడానికి ఉచిత విమాన టికెట్లను అందిస్తున్నట్లు వెల్లడించారు.జూన్ 1న నిర్వహించిన లక్కీ డ్రాలో బల్కంపేటకు చెందిన మెడికల్ షాప్ నిర్వాహకుడు నాగేందర్ విజేతగా నిలిచారు. లక్కీ డ్రా ఫలితాలు ప్రకటించగానే అక్కడి సందర్శకులు హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. అయోధ్య యాత్రకు ఉచిత విమాన టికెట్లు లభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని నాగేందర్ తెలిపారు. సాధారణంగా ఎగ్జిబిషన్‌లలో వస్తువుల కొనుగోళ్లకు మాత్రమే పరిమితమయ్యే ఆఫర్లకు భిన్నంగా, భక్తి, కుటుంబ ఆనందాన్ని కలిపి అయోధ్య దర్శనం అవకాశం కల్పించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సందర్శకులకు మరపురాని అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తున్న ప్రజలు కూడా ఈ వినూత్న ఆలోచనను స్వాగతిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు మరింత మందికి ఆధ్యాత్మిక యాత్ర అవకాశాలను అందిస్తాయని అభిప్రాయపడుతున్నారు. అయోధ్య దర్శనం కోసం లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేయడం ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో చర్చనీయాంశంగా మారింది.

# కాంగ్రెస్ - బిఆర్ఎస్ లది 'సుఖ సంసారం

**- ఒకరినొకరు కాపాడుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారు - మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ఆగ్రహం**

**హైద్రాబాద్** తెలంగాణ రాష్ట్రాన్ని గత పదేళ్లు దోచుకున్న బిఆర్ఎస్, ఇప్పుడు పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీలు తెర వెనుక ఒకరికొకరు సహకరించుకుంటూ "సుఖ సంసారం" సాగిస్తున్నాయని బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.బెయిల్ పార్టీగా కాంగ్రెస్: దేశంలో జాతీయ పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ ఉనికి కోల్పోతోంది. ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ (సోనియా గాంధీ), లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు (రాహుల్ గాంధీ) ఇద్దరూ బెయిల్ మీద ఉన్నారు. ఆ పార్టీలో అనేక మంది నాయకులు జైలుకు వెళ్లి వచ్చినవారే.

### కాంగ్రెస్ - బిఆర్ఎస్ ల డూప్ ఫైట్:

తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయి. గతంలో ఫిరాయింపుల సమయంలో బిఆర్ఎస్ కి కాంగ్రెస్ సహకరిస్తే, ఇప్పుడు కాంగ్రెస్ కి బిఆర్ఎస్ సహకరిస్తోంది. ఒకరినొకరు కాపాడుకుంటూ, పైకి మాత్రం కొట్టుకుంటున్నట్టు నటిస్తూ కాలయాపన చేస్తున్నారు. నాటి ఓటుకు నోటు కేసు నుండి నేటి వరకు రాహుల్ గాంధీ అండతోనే ఇరు పార్టీలు కలిసి సంసారం చేస్తున్నాయిని ఎద్దేవా చేశారు.కుటుంబమంతా అవినీతి ఊబిలో బిఆర్ఎస్ అధినేత (కెసిఆర్) పై అవినీతి ఆరోపణలు వచ్చి, నోటీసులు అందితే విచారణకు వెళ్లకుండా కోర్టుల ద్వారా రక్షణ కవచం పొందేందుకు ప్రయత్నించారు. తండ్రి బాటలోనే కొడుకు (కెటిఆర్) కూడా ఫార్ములా-ఇ రేస్, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, జొన్నవాడ అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ, మియాపూర్ భూములు, ఎంసెట్ పేపర్ లీకేజీ వంటి అంశాల్లో అదే పంథా అనుసరిస్తున్నారు.జైళ్లు, నోటీసులు, కోర్టులు:లిక్కర్ స్కామ్ లో కూరుకుపోయి బిఆర్ఎస్ కవిత జైలుకు వెళ్లి వచ్చి విచారణ ఎదుర్కొంటున్నారు. మరోవైపు మేనల్లుడు (హరీష్ రావు) ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై నోటీసులు అందుకొని కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కాళేశ్వరం విషయంలో సిఎజి (అండు) లాంటి రాజ్యాంగ సంస్థలు తప్పులు పట్టినా వీరికి చలనం లేదు.నైతికత లేని రాజీనామాలు: గతంలో ఎల్ఆర్ఎస్ వ్యవహారం, కుక్కల కాటుకు చిన్నారులు బలి కావడం, భవనాలు కూలిపోవడం వంటి ఘటనలపై కోర్టులు మొట్టికాయలు వేసినా, సుమోటోగా స్వీకరించినా నాటి పురపాలక శాఖ మంత్రులుగా ఉన్న తండ్రీకొడుకులు కనీసం రాజీనామా చేయలేదు. అలాంటి వారు ఈరోజు బిజెపికి నీతులు చెప్పడం హాస్యాస్పదం.అరాచక పాలన: కేవలం అవినీతి మాత్రమే కాదు.. న్యాయవాదుల హత్యల వెనుక, ఖమ్మంలో స్వంత పార్టీ మహిళా నాయకురాలిపై లైంగిక వేధింపుల వెనుక బిఆర్ఎస్ నాయకుల హస్తం ఉందన్న వార్తలు వచ్చాయి. మహబూబాబాద్‌లో మహిళా అధికారులను సైతం నాటి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేధించిన చరిత్ర ఉంది.

### కరిగిపోయిన రాష్ట్ర ఆస్తులు - పెరిగిన కుటుంబ ఆస్తులు:

2009 అఫిడవిట్‌లో కెటిఆర్ చూపించిన పదుల కోట్ల ఆస్తి, ఈరోజు వందల కోట్లకు ఎలా పడగలెత్తింది? ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చి, ప్రభుత్వ ఆస్తులను కరిగించేసి.. ఈ తండ్రి, కొడుకు, కూతురు, మేనల్లుడు మాత్రం వందల కోట్లు వెనకేసుకున్నారు.ఒక్కొక్క కుంభకోణం, ఒక్కొక్క నోటీసు నుండి ఈ కుటుంబం తప్పించుకోలేదు.

కాంగ్రెస్‌కు 'బి-టీమ్'గా మారి ఎంత సుఖ సంసారం చేసినా, తెలంగాణ ప్రజలను పిచ్చోళ్లను చేయాలని చూస్తే భారతీయ జనతా పార్టీ ఊరుకోదు. వీరి అక్రమాలను, తెరవెనుక సంసారాన్ని బిజెపి ఖచ్చితంగా బట్టబయలు చేస్తుందని, వీరంతాయూ త్వరలోనే చువ్వలు లెక్కబెట్టడం ఖాయమని ప్రభాకర్ గారు హెచ్చరించారు.

# కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కర స్నానం.

### ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి వివేక్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ.



మంథని ( ప్రశ్న న్యూస్) సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తో కలిసి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ కి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో పాటు భాజా భజంత్రీల నడుమ ఘన స్వాగతం పలికారు. ఆలయ ఈఓ, వేద పండితులు ఆశీర్వచనాలు అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, "కాళేశ్వరం తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక. సరస్వతి అంత్య పుష్కరాలు భక్తులకు పవిత్రమైన అవకాశం. రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసింది" అని తెలిపారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, "కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాం. ఈ పుష్కరాలు రాష్ట్ర ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంచుతున్నాయి. భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు. పుష్కరాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మెప్పు కొరకె నిరుద్యోగులకు ఉచిత హామీలు ఇచ్చిన గ్రంధాలయ చైర్మన్ .


- త్వరలో 6 వేల పోస్టుల భర్తీ చేయనున్న ప్రభుత్వం .
- మంథని గ్రంథాలయంలో వసతులు ఏడా..
- మంథనిలో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేయాలి..
- శిధిలావస్థకు చేరిన ప్రస్తుత గ్రంథాలయం..
- గ్రంథాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి...
- లేకుంటే నిరుద్యోగులందరిని కలుపుకొని ముట్టడి చేస్తాం.
- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్





మంతని( ప్రశ్న న్యూస్) నిరుద్యోగ యువకుల కోసం త్వరలో రాష్ట్ర ప్రభుత్వం 6 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తుందని చెప్పిన విషయం తెలిసిందే. అయితే మంథని పట్టణంలో ఉన్న గ్రంథాలయంలో పూర్తిగా వసతులు కరువయ్యాయి. గ్రంధాలయం శితిలావస్థలో చేరుకోంది.దానికి తోడు నిరుద్యోగ యువతీ,యువకులు చదువుకోవడానికి ఇబ్బంది మారింది. పోటీ పరీక్షలకు సిద్దమయ్యే యువతి యువకులు ఎక్కువ సంఖ్యలో వస్తే ఇరుకుగా ఉంటుంది.అయితే గత సంవత్సరంలో ప్రజా సంఘాల నాయకులు గ్రంధాలయాన్ని సందర్శించి సమస్యల గురించి గ్రంధాలయ చైర్మన్ ద్రుష్టికి తీసుకెళ్లారు.అందులో రెండు మూడు సమస్య లు పరిష్కారం అయ్యాయి.అందరికి అందుబాటులో ఉండే విధంగా డిజిటల్ సెంట్రల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తానని చెప్పడం జరిగింది.మంథని లైబ్రరీ లో ఖాళీగా ఉన్న పోస్టు లను భర్తీ చేస్తానని చెప్పినప్పటికి ఇంత వరకు కుడా భర్తీ చేయలేదు.మంత్రి మెప్పు కొరకె గ్రంధాలయ చైర్మన్ నిరుద్యోగుల కు ఉచిత హామీలు ఇచ్చారా..? అని నిరుద్యోగుల నుండి విమర్శలు వినబడుతున్నాయి.వెంటనే మంథనిలో ఖాళీగా ఉన్న పోస్టును భర్తీ చేసి... అన్ని వసతులతో కూడిన నూతన డిజిటల్ సెంట్రల్ లైబ్రరీ ని నిర్మాణం చేసి నిరుద్యోగులకు పాఠకులకు అందరికి అందుబాటులోకి ఉండే విధంగా నిర్మాణం చేయాలి.లేని పక్షంలో నిరుద్యోగులను అందరిని కలుపుకొని జిల్లా గ్రంధాలయ చైర్మన్ కార్యాలయమును ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నాము.

# మెదక్ జిల్లా నూతన డిసిఒ గా పదవి బాధ్యతలు స్వీకరించిన పద్మ



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా నూతన డిసిఒగా బాధ్యతలు స్వీకరించిన పద్మ ఈ సందర్భంగా డిసిఒ కార్యాలయంలో సోమవారం నాడు పదవి బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా మెదక్ జిల్లా సహకార సంఘాల యూనియన్ సభ్యులు డిసిఒ కార్యాలయంలో కలిసి వారికి పూలమాలతో శాలువాతో ఘనంగా సత్కరించిన మెదక్ జిల్లా సహకార సంఘాల యూనియన్ సభ్యులు ఈ సందర్భంగా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన నూతన డిసిఓ పద్మ మాట్లాడుతూ జిల్లాలో సహకార సంఘాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని వారు తెలిపారు ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేసే జిల్లా సహకార సంఘాల ను మెదక్ జిల్లా మొదటిగా పేరు ప్రతిష్టలు తీసుకురావాలని యూని సభ్యులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా సహకార సంఘాల యూనియన్ అధ్యక్షులు యు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, జిల్లా టిఆర్ఎస్కేవి యూనియన్ ప్రెసిడెంట్ పి, నర్సింలు, జిల్లా సభ్యురాలు శోభారాణి, జిల్లా కోశాధికారి అమీర్ ఆలీ, సాయి కిరణ్, వెంకటేశ్వర్లు, రవి, సంతోష్

## రైతుభీమా డబ్బుల వివాదం..

# కన్నతల్లిని హత్య చేసిన కుమారుడు

**- నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధించిన న్యాయస్థానం**

**- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,**

మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) రైతుభీమా డబ్బుల విషయంలో తలెత్తిన వివాదం కారణంగా కన్నతల్లిని కత్తితో హత్య చేసిన కుమారుడికి జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదు విధించినట్లు మెదక్ జిల్లాఎస్పీడి.వి.శ్రీనివాసరావుతెలిపారు.హవేళీఘనపూర్ మండలం తోగిట గ్రామానికి చెందిన పుస్థి నర్సమ్మ, లచ్చయ్య దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. నర్సమ్మ తల్లి పుస్థి బాలమణి మరణించడం, రెండో కుమారుడు అనారోగ్యంతో మృతి చెందడం నేపథ్యంలో రైతుభీమా డబ్బుల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య తరచూ విభేదాలు నెలకొనేవి. ఈ క్రమంలో నర్సమ్మ కుమారుడు పుస్థి బాను ప్రసాద్ డబ్బుల విషయమై తల్లితో గొడవపడ్డాడు. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో 2023 ఆగస్టు నెలలో ఆగ్రహానికి లోనైన బాను ప్రసాద్ కత్తితో తల్లిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి హవేళీఘనపూర్ ఎస్ఐ ఆనంద్ గౌడ్ కేసు నమోదు చేశారు. అనంతరం మెదక్ రూరల్ సీఐ విజయ్ కుమార్, సీఐ రాజశేఖర్ రెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి, కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ జార్జ్ కేసు విచారణ సందర్భంగా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ ప్రాసిక్యూషన్ తరఫున బలమైన వాదనలు వినిపించారు. కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, నిందితుడు పుస్థి బాను ప్రసాద్‌పై అభియోగాలు రుజువైనట్లు నిర్ధారించారు. దీంతో అతనికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని జిల్లా ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ ఎండీ గౌస్, ప్రాసిక్యూషన్ బృందాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.



# వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలి..

### టీయూడబ్ల్యూజే-ఐజేయు వినతి



పెద్దపల్లి( ప్రశ్న న్యూస్) జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే-ఐజేయు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్, జిల్లా అధ్యక్షులు మల్లావర్జుల వంశీ విద్యానంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్ మాట్లాడుతూ.. పెద్ద, మధ్య, చిన్న తరగతి పత్రికలకు, ఎలక్ట్రానిక్ మీడియాకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మండల రిపోర్టర్లందరికీ సీఏ సర్టిఫికెట్‌తో ఎటువంటి సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పోలీస్ కమిషనరేట్, సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్సిఎల్ వంటి ప్రతిష్టాత్మక రంగాలు ఉండటంతో పాటు మూడు మండలాలు విస్తరించి ఉన్నాయని, ఈ నేపథ్యంలో అక్కడ ప్రధాన పత్రికలకు రాత్రింబవళ్లు శ్రమిస్తున్న 9 మంది ప్రతినిధులకూ అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వడం ఎంతో అవసరమని వివరించారు.మొదటి విడతలో కమిటీ ఆమోదించినప్పటికీ కొందరు నిజమైన వర్కింగ్ జర్నలిస్టులను పక్కన పెట్టారని, వారి వివరాలపై మరోసారి క్షుణ్ణంగా పరిశీలన జరిపి కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ప్రింట్ అయ్యి వివిధ కారణాలతో హోల్డ్‌లో పెట్టిన అక్రిడేషన్ కార్డులను సైతం వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రింట్ మీడియాలో నియోజకవర్గ స్థాయి కార్డులను తొలగించడం వల్ల రిపోర్టర్లంతా ప్రస్తుతం మండల స్థాయి కార్డులు పొందాల్సి వస్తోందని, వారందరికీ ప్రయాణ ఇబ్బందులు కలగకుండా స్టేట్ బస్ పాస్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల హక్కుల రక్షణకు, సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని కలెక్టర్‌ను కోరగా, కలెక్టర్ కోయ శ్రీహర్ష వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు టికె శ్రీనివాస్, సామల హరికృష్ణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరమల్ల విద్యాసాగర్ రావు, ఆకుల రమేష్, జిల్లా నాయకులు తగరం రాజు, ముత్యాల నర్సయ్య, కొమురవెల్లి భాస్కర్, గాదె బాలయ్య, మృత్యుంజయ, కొండ లింగమూర్తి, తిరుమల సురేష్, ముఖేష్, జైపాల్, మోదుంపల్లి సాగర్, దార మధు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల విలీనం ఎప్పుడూ?

### మెదక్‌లో డిపో ఎదుట నిరసన కార్యక్రమం



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) టీజీఎస్ ఆర్టీసీ సమైక్య జేఏసీ కన్వీనర్ శ్రీ అశ్వత్థామ రెడ్డి గారు ఇచ్చిన పిలుపు మేరకు మెదక్ డిపోలో కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీ మేడి రాధాకిషన్ రావు, డిపో చైర్మన్ శ్రీ సంఘమేశ్వర్, వైస్ చైర్మన్ శ్రీ నరసింహులు, కన్వీనర్ రాజు, కో కన్వీనర్ వనిత రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 సందర్భంగా ప్రభుత్వం "అపాయింటెడ్ డే"ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీజీఎస్ ఆర్టీసీ ఏర్పాటుకు ముందు జరిగిన చర్చలు, హామీలు మరియు గతంలో ఇచ్చిన భరోసాలను గుర్తు చేస్తూ, ఆర్టీసీ ఉద్యోగుల విలీనమే ప్రస్తుతం ప్రధాన డిమాండ్ అని పేర్కొన్నారు.ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా విలీన ప్రక్రియను పూర్తి చేసి ఉద్యోగుల న్యాయమైన ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ డిపోకు చెందిన పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. వారిలో సత్యనారాయణ గౌడ్, సంగమేశ్వర్, శేఖర్, అజాజ్, ప్రభుకుమార్, రాధిక, స్వప్న, సౌజన్య, భిక్షపతి, యాదగిరి, వి.ఎస్. రాములు, లాలు, ప్రభాకర్ తదితరులు పాల్గొని ఆర్టీసీ ఉద్యోగుల విలీనాన్ని వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి, సంరక్షించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

### మొక్కలు నాటిన కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, అధికారులు, యువత



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)వాతావరణ సమతుల్యత పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని వాటిని సంరక్షించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జూన్ 1 వ తేదీ నుంచి 12 వ తేదీ వరకు పర్యావరణ ఉత్సవాలలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమీపంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ సత్యనారాయణ, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, జిల్లా అధికారులు, యువత, విద్యార్థులు మామిడి మొక్కలు నాటి నీటిని పోశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తమ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని తెలియజేశారు. మొక్కలు నాటడంతో ప్రస్తుతంతో పాటు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. పర్యావరణ ఉత్సవాల కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమాల్లో అందరినీ భాగస్వామ్యం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, ఉద్యానవన శాఖ అధికారి శరత్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీరప్ప కామరాతి కళ్యాణ జాతర మహోత్సవం



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) వెంకటాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహిస్తున్న బీరప్ప కామరాతి కళ్యాణ జాతర మహోత్సవానికి సిరిసిల్ల శాసనసభ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి హాజరై బీరప్ప కామరాతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందిన ఆయన జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ యాదవ సంఘం పెద్దలు కేకే మహేందర్ రెడ్డి కి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. జాతరకు హాజరైన భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం జాతర నిర్వహణ కమిటీ సభ్యులతో కలిసి మహోత్సవ కార్యక్రమాలను వీక్షించిన కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ బీరప్ప కామరాతి జాతర తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఉత్సవాలు ప్రజల్లో ఐక్యతను, సామాజిక బంధాలను మరింత బలోపేతం చేస్తాయని తెలియజేశారు.

జాతర మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులు, శ్రీ కృష్ణ యాదవ సంఘం నాయకులు, గ్రామ ప్రజలను ఆయన అభినందించారు. వెంకటాపూర్ గ్రామంలో జరుగుతున్న ఈ జాతర మహోత్సవం భక్తజన సందోహంతో అత్యంత వైభవంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు షేక్ సబెర బేగం గౌస్, నాయకులు సూడిది రాజేందర్, మర్రి శ్రీనివాస్ రెడ్డి, అగ్రహారం సర్పంచ్ మామిండ్ల కిషన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, మూర్తి, వెంకటేష్, పద్మారెడ్డి, వెంకటాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తిరుపతి రెడ్డి, మెండే శ్రీనివాస్ యాదవ్, జజ్జరి దేవేందర్, నంది కిషన్, పొన్నాల మల్లారెడ్డి, వడ్నాల దేవయ్య, పాండవుల నగేష్, మేడిశెట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

### - మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు : మహమ్మద్ అజ్జూ



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. ఎన్నో ఏళ్ల ఉద్యమం, వేలాది మంది త్యాగాల ఫలితంగా జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.తెలంగాణ సాధనలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యాయి. రైతు సంక్షేమం, తాగునీటి సదుపాయాలు, సామాజిక భద్రత, పారిశ్రామిక ప్రగతి వంటి రంగాల్లో తెలంగాణ ప్రత్యేక గుర్తింపు పొందింది.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం మన ఆత్మగౌరవానికి, ఐక్యతకు, అభివృద్ధి సంకల్పానికి ప్రతీక. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుకుంటూ మరోసారి ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని మాజీ మండల కో-అప్షన్ సభ్యులు మహమ్మద్ అజ్జూ పేర్కొన్నారు.

# ఆర్టీఐకి అడ్డుగోడలు




## పారదర్శకతకు సంకెళ్లు

- సమాచార హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్న అధికార యంత్రాంగం
- అసంపూర్ణ సమాధానాలు, పొంతనలేని జవాబులతో పౌరుల హక్కులకు గండి
- పారదర్శక పాలనకు ఉద్దేశించిన చట్టం అమలులో నిర్లక్ష్యం

**సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ప్రతి పౌరుడికి ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని తీసుకురావడానికి కల్పించిన కీలకమైన హక్కు. అయితే అనేక ప్రభుత్వ శాఖలు, కార్యాలయాల్లో ఆర్టీఐ దరఖాస్తులకు సరైన స్పందన లేకపోవడం, సమాధానాలు ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం ఆందోళన కలిగిస్తోంది. పలు శాఖల్లో ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్నలకు నేరుగా సమాధానం ఇవ్వకుండా, ఫైళ్ల సంఖ్యలు, సాధారణ ఉత్తర్వులు లేదా సంబంధం లేని పత్రాలను జతచేసి పంపడం జరుగుతుందని ప్రజలు వాపోతున్నారు.**

(గౌటీ బాల సాయి తిలక్ - ప్రశ్న న్యూస్)

దేశంలో ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడం, అవినీతి నిరోధించడం లక్ష్యంగా అమలులోకి వచ్చిన సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ-2005) నేడు అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్లక్ష్యానికి గురవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత కలిగిన అధికారులు, ఉద్యోగులు ఆర్టీఐ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించకపోవడం, అడిగిన ప్రశ్నలకు సంబంధం లేని సమాధానాలు ఇవ్వడం, అసంపూర్ణ వివరాలు అందించడం వంటి ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి.సమాచారం కోసం దరఖాస్తు చేసిన పౌరులు చట్టం ప్రకారం 30 రోజులలోపు సమాధానం పొందే హక్కు కలిగి ఉన్నప్పటికీ, అనేక శాఖల్లో ఈ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులు ఉద్దేశపూర్వకంగానే సమాచారాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రశ్న ఒకటి.. సమాధానం మరొకటి

ఆర్టీఐ దరఖాస్తుల్లో స్పష్టంగా అడిగిన ప్రశ్నలకు బదులుగా, సంబంధం లేని పత్రాలు పంపించడం, అసలు ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా తప్పించుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పది ప్రశ్నలు అడిగితే కేవలం రెండు లేదా మూడు ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు ఇచ్చి మిగిలిన వాటిని పూర్తిగా విస్మరిస్తున్నారు అధికారులు. మరికొన్ని శాఖల్లో "సమాచారం అందుబాటులో లేదు", "మా పరిధిలో లేదు", "రికార్డులు లేవు" అనే సాధారణ జవాబులతో బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే అదే సమాచారం ఇతర సందర్భాల్లో అందుబాటులో ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

### అసంపూర్ణ సమాచారం.. అప్పీల్లకు పరుగులు

ఆర్టీఐ ద్వారా పూర్తి సమాచారం లభించకపోవడంతో పౌరులు మొదటి అప్పీల్, రెండో అప్పీల్ వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనివల్ల సమయం, డబ్బు, శ్రమ వృథా అవుతున్నాయి. ఒక సాధారణ సమాచారం కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టం ప్రకారం సమాచారం ఇవ్వకపోతే లేదా తప్పుదారి పట్టించే సమాచారం అందిస్తే సంబంధిత అధికారులపై జరిమానా విధించే అవకాశం ఉన్నప్పటికీ, ఆ నిబంధనలు కఠినంగా అమలు కాకపోవడం వల్ల నిర్లక్ష్యం కొనసాగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### పారదర్శకతకు బదులు గోప్యతకు ప్రాధాన్యం

ప్రజలకు జవాబుదారీతనం పెంచాల్సిన ప్రభుత్వ వ్యవస్థలో కొన్ని కార్యాలయాలు ఇంకా గోప్యత ధోరణినే కొనసాగిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రజా నిధులతో నిర్వహించే పనుల వివరాలు, అనుమతులు, టెండర్లు, నియామకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ఇవ్వడంలో కొంతమంది అధికారులు ఆసక్తి చూపడం లేదని ఆర్టీఐ కార్యకర్తలు చెబుతున్నారు. ప్రభుత్వ శాఖలలో పారదర్శకత పెరిగితే అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందనే కారణంగానే కొందరు సమాచారాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

### చట్టం ఉద్దేశ్యానికే తూట్లు

సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుడికి ప్రభుత్వ కార్యకలాపాలపై సమాచారం పొందే రాజ్యాంగబద్ధమైన హక్కును కల్పించింది. అయితే అధికారులు ఇచ్చే పొంతనలేని సమాధానాలు, అసంపూర్ణ వివరాలు, ఆలస్యపు జవాబులు చట్టం అసలు ఉద్దేశ్యానికే తూట్లు పొడుస్తున్నాయని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. "ఆర్టీఐకి సమాధానం ఇవ్వడం ఒక ఉపకారం కాదు, అది చట్టబద్ధమైన బాధ్యత" అని నిపుణులు గుర్తుచేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారులనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు.

### శిక్షణ లోపమా? లేక ఉద్దేశపూర్వక నిర్లక్ష్యమా?

ఆర్టీఐ దరఖాస్తులను సక్రమంగా పరిష్కరించడంలో కొన్ని శాఖల అధికారులు సరైన అవగాహన లేకపోవడం కూడా ఒక కారణంగా కనిపిస్తోంది. అయితే అనేక సందర్భాల్లో ఇది కేవలం అవగాహన లోపం కాదని, సమాచారం ఇవ్వకుండా ఉండేందుకు ఉద్దేశపూర్వకంగా అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ఉన్న పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు (పీఐఓలు) చట్టంలోని నిబంధనలను పూర్తిగా పాటించేలా ప్రత్యేక శిక్షణలు, పర్యవేక్షణ అవసరమని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

### కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఆర్టీఐ చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నాయి. అసంపూర్ణ సమాచారం ఇవ్వడం, ప్రశ్నలకు సంబంధం లేని సమాధానాలు పంపడం, ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని కోరుతున్నాయి. సమాచార హక్కు చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువులాంటిదని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజల పట్ల జవాబుదారీతనం ప్రదర్శించి, అడిగిన సమాచారాన్ని పూర్తిగా, పారదర్శకంగా, సకాలంలో అందించినప్పుడే ఈ చట్టం లక్ష్యం నెరవేరుతుంది.

### ప్రజల ప్రశ్నలకు జవాబు చెప్పాల్సిందే


ప్రజల పన్నుల డబ్బుతో నడిచే ప్రభుత్వ వ్యవస్థ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కలిగి ఉంది. ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్నలకు అసంబద్ధమైన జవాబులు ఇవ్వడం, సమాచారాన్ని దాచిపెట్టడం, చట్టాన్ని నిర్లక్ష్యం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. సమాచార హక్కు చట్టాన్ని తుంగలో తొక్కే ధోరణి కొనసాగితే ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

**ఆర్టీఐ హక్కు.. అధికారుల దయాదాక్షిణ్యం కాదు. ప్రజలు అడిగిన సమాచారాన్ని ఇవ్వడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత. ఆ బాధ్యతను విస్మరించే వారిపై చర్యలు తీసుకున్నప్పుడే సమాచార హక్కు చట్టానికి నిజమైన గౌరవం లభిస్తుంది.**

# టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం

## - ప్రజవాణి ఫిర్యాదులకు పరిష్కారం లేదా

**ఎల్బీనగర్ (ప్రశ్న న్యూస్)**ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని బీడీరెడ్డి గార్డెన్ నుండి నంది హిల్స్ రహదారిపై భారీ అక్రమ షెడ్ నిర్మాణం జరుగుతోందని స్థానిక కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని వాపోతున్నారు.అక్రమ నిర్మాణాల విషయంలో హైకోర్టు పలు సందర్భాల్లో కఠిన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటి అమలులో స్థానిక అధికారుల వైఖరి ప్రశ్నార్థకంగా మారిందని కాలనీవాసులు అంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నా, వాటిని అడ్డుకునే చర్యలు లేకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రజవాణిలో పలుమార్లు ఫిర్యాదులు నమోదు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సాధారణ ప్రజలు ఎవరిని ఆశ్రయించాలని ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులు కేవలం రికార్డులకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజవాణిలో వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను అడ్డుకొని ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని కోరుతున్నారు.



# ఇకపై అన్ని పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగానే

## - టీజీపీఎస్సీలో కీలక సంస్కరణలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించే అన్ని నియామక పరీక్షలను ఇకపై కంప్యూటర్ ఆధారిత విధానంలోనే (సీబీటీ) నిర్వహిస్తామని చైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా నియామక ప్రక్రియలో మరింత భద్రత, పారదర్శకత సాధ్యమవుతుందని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ "ప్రస్తుత పరిస్థితుల్లో నియామక పరీక్షల నిర్వహణకు కంప్యూటర్ ఆధారిత విధానమే అత్యుత్తమ మార్గం. సంప్రదాయ ఓఎంఆర్ విధానంతో పోలిస్తే ఇది ఎంతో సురక్షితమైనది. పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేసే వెసులుబాటు ఉంటుంది" అని వివరించారు. కమిషన్‌లో అనేక సంస్కరణలు ప్రవేశపెడుతున్నామని, అభ్యర్థుల్లో విశ్వాసం నింపేందుకు సాంకేతికతను వాడుకుంటున్నామని తెలిపారు. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలివ్వడం సాధ్యం కాదని, అందుకే పోటీ పరీక్షల్లో కొందరికి నిరాశ తప్పదని ఆయన అన్నారు. కమిషన్‌పై వచ్చే నిరాధార విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. పారదర్శకతను పెంచే ఉద్దేశంతో ఇకపై ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు.

# క్రికెట్‌లో ఐసీసీ కీలక నిర్ణయాలు

## - వెలుతురు తగ్గితే పింక్ బాల్!

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టెస్ట్ క్రికెట్‌లో పలు కీలక మార్పులకు ఆమోదముద్ర వేసింది. అహ్మదాబాద్‌లో జరిగిన వార్షిక బోర్డు సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలలో ముఖ్యమైనది, వెలుతురు మందగించినప్పుడు పింక్ బాల్ వాడకం. టెస్ట్ మ్యాచ్‌లలో వెలుతురులేమి కారణంగా ఆట నిలిచిపోకుండా, పూర్తి ఓవర్లు జరిగేలా చూడటమే ఈ ప్రయోగం ముఖ్య ఉద్దేశం. ఈ కొత్త నిబంధన ప్రకారం, టెస్ట్ మ్యాచ్ ఎప్పటిలాగే రెడ్ బాల్‌తో ప్రారంభమవుతుంది. ఒకవేళ ఆట మధ్యలో వెలుతురు తగ్గితే, ఫ్లడ్‌లైట్ల వెలుగులో పింక్ బాల్‌తో ఆటను కొనసాగించవచ్చు. అయితే, సిరీస్ ప్రారంభానికి ముందే ఇరు జట్లు దీనికి అంగీకరించాల్సి ఉంటుంది. ఉదాహరణకు, 90 ఓవర్ల ఆటలో 75 ఓవర్లు ముగిశాక వెలుతురు తగ్గితే, మిగిలిన ఓవర్లను పింక్ బాల్‌తో పూర్తి చేస్తారు.దీంతో పాటు మరికొన్ని ముఖ్యమైన నిబంధనలను కూడా ఐసీసీ ఆమోదించింది. ఇకపై డ్రింక్స్ విరామ సమయంలో హెడ్ కోచ్‌లు మైదానంలోకి వచ్చి ఆటగాళ్లతో మాట్లాడేందుకు అనుమతి ఇచ్చారు. అలాగే, బౌలర్ల సందేహాస్పద యాక్షన్‌ను పర్యవేక్షించేందుకు మ్యాచ్ అధికారులు హాక్-ఐ డేటాను ఉపయోగించుకోవచ్చు. ఇప్పటివరకు ప్రయోగాత్మకంగా ఉన్న లెగ్-సైడ్ వైడ్ల నిబంధనను శాశ్వతం చేశారు. టీ20 మ్యాచ్‌లలో 15 నిమిషాల విరామాన్ని తప్పనిసరి చేసింది. ఆట తిరిగి ప్రారంభమైనప్పుడు బ్యాట్స్‌మెన్ సిద్ధంగా ఉండాలని పేర్కొంది. మరోవైపు, నిబంధనల ఉల్లంఘన కారణంగా క్రికెట్ కెనడా సభ్యత్వంపై ఐసీసీ తక్షణమే సస్పెన్షన్ వేటు వేసింది. అయితే, సస్పెన్షన్ కాలంలోనూ కెనడా జాతీయ జట్లు ఐసీసీ ఈవెంట్లలో పాల్గొనవచ్చని స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధనలన్నీ 2026 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.క్రికెట్ కెనడాకు సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడానికి కొన్ని కఠినమైన షరతులు విధించింది. ఈ ప్రక్రియను ఐసీసీ నార్మలైజేషన్ కమిటీ పర్యవేక్షిస్తుంది. వారు నిర్దేశించిన మార్పులను, నిబంధనలను విజయవంతంగా అమలు చేస్తేనే క్రికెట్ కెనడా సభ్యత్వాన్ని తిరిగి పునరుద్ధరిస్తారు. అప్పటివరకు వారి సభ్యత్వం ప్రమాదంలో ఉన్నట్లేనని ఐసీసీ పరోక్షంగా సూచించింది. ఐసీసీ బోర్డు మహిళల క్రికెట్‌కు సంబంధించి కూడా కీలక నిర్ణయాలు ఆమోదించింది. ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ 2027 టోర్నమెంట్ తేదీలను మార్చింది. ఈ టోర్నీని 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు.దీంతో పాటు, 2026లో 'ఐసీసీ మహిళల ఎమర్జింగ్ నేషన్స్ ట్రోఫీ'ని ప్రారంభించనున్నట్లు బోర్డు ధృవీకరించింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 10 జట్లు పాల్గొంటాయి. వీటిలో ఐదు పూర్తిస్థాయి సభ్య దేశాలు, ఐదు అసోసియేట్ సభ్య దేశాలు ఉంటాయి. ర్యాంకింగ్‌లు, గత టీ20 ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రదర్శనల ఆధారంగా జట్లను ఎంపిక చేయనున్నారు.

# పవన్ కల్యాణ్‌కు పొన్నం ప్రభాకర్ అల్టిమేటం

## - క్షమాపణ చెప్పాకే అడుగుపెట్టాలని డిమాండ్!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన 'నవనిర్మాణ సభ'పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే ఇక్కడ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును గతంలో పవన్ కల్యాణ్ తీవ్రంగా వ్యతిరేకించారని మంత్రి పొన్నం గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం ముట్టలేదని పవన్ చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ అసలు ఏ నైతిక హక్కుతో ఆయన హైదరాబాద్‌లో ఇంత పెద్ద బహిరంగ సభను నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు."తెలంగాణ దృష్టి పడితే కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతాయి" అంటూ గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, భావాలను తీవ్రంగా గాయపరిచాయని పొన్నం మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై పవన్ సమాధానం చెప్పి తీరాలన్నారు. తెలంగాణలో రాజకీయ ప్రయోజనాల కోసం, ఇక్కడి ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ద్వేషాన్ని నింపేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీని వెనుక బీజేపీతో పవన్‌కు ఉన్న 'తెరవెనుక ఒప్పందం' స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. ఈ సభ నిజంగా అభివృద్ధి కోసమే అయితే గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో పెట్టుకోవచ్చు కదా కేవలం హైదరాబాద్‌లోనే ఎందుకు పెడుతున్నారని మంత్రి ప్రశ్నించారు. ఏపీ ప్రజలు పవన్‌కు బాధ్యతాయుతమైన పదవి ఇచ్చారని, తెలంగాణ రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి ఆంధ్రప్రదేశ్ సమస్యలపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు. పవన్ గనుక క్షమాపణ చెప్పకపోతే తెలంగాణ ప్రజలు ఈ సభను తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588